తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట యాద్రాద్రి భువనగిరి
గురువారం 20 ఆగష్టు 2026
పేజీలు : 8
Follow :

# బిజెపి, బీఆర్ఎస్ తోడు దొంగలు..!

○తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యంపై విషం కక్కుతున్నాయి.. ○దళిత, గిరిజన, మైనార్టీల ఓట్లను తొలగించేందుకు కుట్ర.. ○70 లక్షల ఓటర్లను గందరగోళంకు గురి చేస్తున్నారు.. ○కాంగ్రెస్ శ్రేణులు మరింత అప్రమత్తంగా ఉండాలి.. ○మిడియా సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఫైర్..!




**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, ఆగస్టు (జనంసాక్షి) :** బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు తోడు దొంగలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన పిఎసి సమావేశం అనంతరం ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్ తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ విపక్ష పార్టీలపై నిప్పులు చెరిగారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకు కుట్రపూరిత రాజకీయాలకు తెర లేపారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చేనాటికి అప్పుల రాష్ట్రాన్ని అప్పగించినప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పేదల సంక్షేమానికి ఏమాత్రం వెనకడుగు వేయకుండా అనేక కార్యక్రమాలను కొనసాగిస్తున్నామన్నారు. అయినప్పటికీ బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు ప్రజల్లో వస్తున్న ఆదరణ ను జీర్ణించుకోలేక ఇందిరమ్మ రాజ్యంపై విషం కక్కుతున్నాయని మండి పడ్డారు. కేవలం కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తున్నారన్న అక్కసుతో దళిత, గిరిజన, మైనార్టీ వర్గాలకు చెందిన ఓటర్లను బిజెపి టార్గెట్ చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 67 లక్షల నుంచి 68 లక్షల ఓట్లను తొలగించి వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావాలని ఆ పార్టీ భావిస్తోందన్నారు. ఒకటి కాదు రెండు కాదు మరో 70 లక్షల ఓట్లను గాలిలో పెట్టి ఓటర్లను గందరగోళానికి గురి చేస్తున్నారని విమర్శించారు. ఈ కుట్రలను తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

మిగతా 2లో



# కామేపల్లిలో పడకేసిన పారిశుధ్యం!

○అధికారుల పట్టీపట్టనట్లు.. సర్పంచులు చూడని వైనం
○పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు.. ప్రైవేట్ ఆస్పత్రుల పాలవుతున్న ప్రజలు
○బస్టాండ్‌లో పేరుకుపోయిన చెత్త.. కుక్కలకు నివాసంగా మారిన వైనం
○పరిశీలన కరువైన ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు
○స్పందించాలి: కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి తక్షణ చర్యలకు డిమాండ్

**కామేపల్లి,ఆగస్టు 19 (జనంసాక్షి):** వర్షాకాలం కావడంతో మండలంలో పలు చోట్ల గ్రామాల్లో పారిశుధ్యం కంపు కొడుతుంది. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా అటు అధికారులు...ఇటు సర్పంచులు ఉదాసీనంగా వ్యవహరించడంతో సీజనల్ వ్యాధులతో పాటు విష జ్వరాలు పొంచి ఉన్నాయి. గ్రామ ప్రజలు వ్యాధుల పాలు అయ్యి ప్రైవేట్ ఆస్పత్రుల లో చేరే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని గ్రామాలలో అక్కడక్కడ వినికిడి వినిపిస్తూ వస్తుంది. మండల కేంద్రమైన కామేపల్లి లో పలు వీధులు అపరిశుభ్రంతో దర్శన మిస్తున్నాయి. ఈ గ్రామంలో ఆస్పత్రి సమీపంలో ఉన్న బస్టాండ్ కు వీధి కుక్కలకు నివాసంగా మారింది. ఈ బస్టాండ్ లో చెత్త ను పరిశుభ్రం చేయకుండా ఉండటంతో పేరుకుపోయి దుర్గంధం వెద జల్లుతుంది. అయినా పట్టించుకోనే నాధుడు లేకుండా పోయారు.

వార్తా లోపలి పేజీలో

# ఖమ్మం సిసియస్ పోలీసులకు చిక్కిన టోకరా కరాగాళ్లు

**ఖమ్మం కార్పొరేషన్ ఆగస్టు 19 జనంసాక్షి**
నకిలీ బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి ఫైనాన్స్ సంస్థ నుంచి రుణాలు పొందుతూ మోసాలకు పాల్పడుతున్న ముఠాపై ఖమ్మం సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు సిసియస్ ఇన్స్పెక్టర్ ఎస్. రాజ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్ ఫిర్యాదు మేరకు సిసియస్ ఏసీపీ మహ్మద్ సర్వర్ పర్యవేక్షణలో విచారణ జరిపి ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి 11 నకిలీ బంగారు ఉంగరాలు, మొత్తం 35.8 గ్రాముల బరువు, సుమారు రూ.4 లక్షల విలువైన ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సీసీఎస్ ఇన్స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిందితులు నకిలీ బంగారు ఆభరణాలను సిద్ధం చేసుకుని వాటిని అసలైన బంగారంగా చూపిస్తూ నగరంలోని ముత్తూట్ గోల్డ్ లోన్ సంస్థల్లో తాకట్టు పెట్టి రుణాలు పొందిన్నట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడిగా ఇసంపల్లి సాయివంశీ (34) షేక్ మహబూబ్ (33), జూపల్లి రాము (35)లను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో కొక్కిరేణి సందీప్ (27), ముండాడ రామచందర్ (39) పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు కొనసాగుతోందని తెలిపారు. కేసు దర్యాప్తులో చురుకుగా పనిచేసిన ఎస్ఐ వంశీ, హెడ్ కానిస్టేబుల్ ఓం ప్రకాశ్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, హరి, జానీ, నరసింహారావు, శ్రీధర్, సతీష్ తదితరులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# గోమోర్ రైతన్నను గోల్లుమనిపించింది !

○అవగాహన లేని సిబ్బందితో ఎరువులు పంపిణీ చేస్తున్న వైనం ?
○8ఎకరాల వరి పంట నాశనం అయ్యిందని కన్నీరు పెడుతున్న రైతన్న ?
○అగ్రికల్చర్ ఏవో ను మిడియా సంప్రదిస్తే పొంతన లేని వివరణ !
○వరి పొలం ఎర్రబారి నష్టపోయమంటున్న మండల రైతులు !?
○గోమూర్ కంపెనీ చుట్టూ తిరిగి అలిసిపోయిన మట్టి పూలు !?
○ప్రభుత్వం ఆదుకోవాలంటూ విజ్ఞప్తి




వార్తా లోపలి పేజీలో

# కామేపల్లిలో పడకేసిన పారిశుధ్యం!





అదేవిధంగా రామకృష్ణ పురం, ఊట్కూర్, గోవింద్రాల గరిడేపల్లి నెమలి పూరి బర్లగూడెం పింజరమడుగు టేకుల తండా అక్కడక్కడ తదితర పలు గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. మండలంలో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని మండల పంచాయతీ అధికారి కనీసం ఏ గ్రామం సందర్శించిన దాఖలాలు లేవు శానిటేషన్ ఈ కాలంలో దోమల నివారణకు మెరుగుపరచడానికి ఆయన ఇప్పుడు వరకు తీసుకున్న చర్యలు కూడా కనిపించడం లేదు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు కూడా విధులకు వస్తున్నామా,వెళు తున్నామా అనే ఆలోచనలతో పనిచేస్తున్నట్లు కనిపిస్తుంది తప్ప తాము ఎక్కడ ఉద్యోగం చేస్తే అక్కడ సొంత గ్రామపంచాయతీ లాగా అభివృద్ధిపై కనీసం ఆలోచన చేయకపోవడం బాధాకరమని పారిశుద్ధాన్ని మెరుపరచకపోవడం విచారకరం. మనీ ఇప్పటికైనా అధికారులు సర్పంచులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యన్ని మెరుగుపరచాలని ప్రజలను దోమల భారీ నుండి కాపాడాలని ఆయా పాలు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ జిల్లా పంచాయతీ అధికారి మండల అధికారుల లోపాతో పరివేక్షణ చేయకుండా ఉన్న దానిపై ఎలాంటి ఆదేశాలు ఇస్తారో వేచి చూడాల్సిందే అని ప్రజల కు న్యాయం జరుగుతుందా లేదా అని ప్రజల్లో ఒక ఇనికిడి వినిపిస్తుంది..

## అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు మంజూరు చేయాలి

### బీజేపీ నేత ధరణిపతి రమణారావు



చింతపల్లి, ఆగస్టు 19(జనంసాక్షి)
తెలంగాణలో అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు మంజూరు చేసి, వెంటనే పంపిణీ చేయాలని బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా మాజీ కార్యవర్గ సభ్యులు ధరణిపతి రమణారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రేషన్ కార్డులపై రాష్ట్ర ప్రభుత్వ పెద్దల ఫొటోలు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో, పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని గుర్తిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోను కూడా పెట్టాలని ఆయన కోరారు. రాజకీయ ప్రచారానికి ప్రాధాన్యత ఇవ్వకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రమణారావు అన్నారు.రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తదితరుల ఫొటోలు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో, పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోను కూడా రేషన్ కార్డులపై తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కోరారు.కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రజలకు అందుతున్న సంక్షేమ ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయాలని అన్నారు. రేషన్ కార్డుల పంపిణీలో రాజకీయ ప్రచారానికి ప్రాధాన్యత ఇవ్వకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి కార్డు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రమణారావు సూచించారు. సంక్షేమ పథకాల అమలులో జాప్యం లేకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు...



## జ్వర పీడితుల సర్వే

**జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి):**
జాజిరెడ్డిగూడెం మండలం కేంద్రంలో బుధవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశాఖ ఇంటింటికి తిరిగి జ్వర పీడితుల సర్వే నిర్వహించారు. ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహించి జ్వరాల బారిన పడిన వారికి మందులు పంపిణీ చేశారు. వీధులలో నిలువ ఉన్న నీటిలో తీమోపాస్ మందును పిచికారి చేశారు. బ్లీచింగ్ పౌడర్ చల్లి వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ బి.నగేష్, హెల్త్ అసిస్టెంట్లు కుంభ వీరయ్య, సైదమ్మ, శకుంతల, పంచాయతీ కార్యదర్శి అశోక్, ఆశా కార్యకర్తలు నాగమ్మ, పద్మ, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి, బీఆర్ఎస్ తోడు దొంగలు..!

### రాహుల్ ప్రధాని కావడం ఖాయం..!

ప్రస్తుతం దేశంలో బీజేపీ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, కాంగ్రెస్ కు ప్రజాభిమానం వెల్లువెత్తుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజనం సృష్టిస్తుందని, రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని వ్యాఖ్యానించారు. తెలంగాణలో కూడా బిజెపి, టిఆర్ఎస్ ఆటలు సాగనివ్వమని వచ్చే ఎన్నికల్లో విజయ డంకా మోగిస్తామన్నారు. సమావేశంలో డిసిసి అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్ల వెంకటరావు, జారే ఆదినారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువాళ్ళ దుర్గాప్రసాద్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పోచంపల్లిలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు



**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 19 (జనంసాక్షి) :** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోచంపల్లి మండల ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు కేమ విష్ణుమూర్తి నేతృత్వంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలిసారిగా స్థానిక శాఖ కార్యాలయంలో జెండా ఆవిష్కరణతో పాటు నూతన శాఖ కార్యాలయాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా స్థానిక ఎస్సై ఎస్. జగన్, జిల్లా అధ్యక్షుడు భోగ చంద్రశేఖర్ పాల్గొని నూతన శాఖ కార్యాలయాన్ని ప్రారంభించారు. మండల అధ్యక్షుడు కేమ విష్ణుమూర్తి జెండాను ఆవిష్కరించగా, ఎస్సై ఎస్. జగన్ ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఇటీవల మృతి చెందిన ఫోటోగ్రాఫర్లు చెక్క రమేష్, ఎలగందుల సత్యనారాయణ కుటుంబాలకు సంఘం ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రచ్చరాజు, చింతల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రవ్వ నవీన్, ఉపాధ్యక్షుడు చెక్క మల్లేష్, కోశాధికారి సకినాల సిద్దేశ్వర్, సహాయ కార్యదర్శి దొడ్డమోని వంశీధర్, గౌరవ సలహాదారు రచ్చ వినోద్ కుమార్, మాజీ అధ్యక్షులు దోర్నాల గణేష్, గుద్దేటి పాండు, కార్యవర్గ సభ్యులు ఏరువ విఘ్నేష్, వంగూరి నరేష్, పుట్టపర్తి కృష్ణ, దోర్నాల కరుణాకర్, చెరుపల్లి లక్ష్మణ్, భోగ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు ప్రశ్నించే గొంతుగా ఉండాలి:ఇ.ఎల్.వి. ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్

- ఘనంగా ఇ.ఎల్.వి. ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ జన్మదిన వేడుకలు
- అన్నదానం, రక్తదాన శిబిరం.. విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, వికలాంగులకు చేయూత
- ఆరు మండలాలకు హెల్మెట్ల పంపిణీ.. దండు మల్కాపురంలో ప్రత్యేక పూజలు
- రెండేళ్లలో శివన్నగూడెం ప్రాజెక్టు పూర్తి చేసి నీళ్లు తీసుకొచ్చే వరకు పోరాటం

**చౌటుప్పల్ ఆగస్టు 19(జనం సాక్షి)**
నల్లగొండ జిల్లా ఉద్యమాల గడ్డ అని, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించే గొంతుగా మారాలని ఇ.ఎల్.వి. ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఇ.ఎల్.వి. ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. దండు మల్కాపురం గ్రామంలోని ఆంధోల్ మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఆయన అభిమానులు, ప్రజలు ఘన స్వగతం పలికారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమంతో పాటు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.



మునుగోడు నియోజకవర్గంలోని మండలలో హెల్మెట్ల పంపిణీ చేశారు. విద్యార్థులకు 120 సైకిళ్లు, 1000 మందికి పైగా ఆటో డ్రైవర్లకు, వికలాంగులకు నిత్యావసర సరుకులు, చేతికర్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన జన్మదినాన్ని గత సంవత్సరం ప్రజల కోసం ఏం చేశాను, వచ్చే సంవత్సరం ప్రజల కోసం ఏం చేయబోతున్నామో గుర్తు చేసుకోవడానికి అన్నారు. మునుగోడులో మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో గర్భిణులు, అత్యవసర చికిత్స అవసరమైన రోగులు వైద్యం కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. శివన్నగూడెం ప్రాజెక్టుకు సంబంధించిన జీవో వచ్చి 20 సంవత్సరాలు పూర్తవుతున్నా, ఇప్పటికీ పనులు పూర్తికాకపోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. శివన్నగూడెం ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేయించి, రైతులకు సాగునీరు అందేలా చేయడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నానని తెలిపారు. శివన్నగూడెం ప్రాజెక్టు పూర్తయితే రైతులు సంవత్సరానికి మూడు పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వ్యవసాయంపై



ఆధారపడిన పలువురు రైతులు ఉపాధి కోసం డ్రైవర్లుగా, కూలీలుగా మారి ఇతర పనులు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. రైతుల జీవితాల్లో మార్పు రావాలంటే శివన్నగూడెం ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని, విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని తెలిపారు.





## పేద విద్యార్థుల చదువుకు యువ టీం అండ

**ముగ్గురు విద్యార్థుల వార్షిక ఫీజు రూ.60 వేల చెల్లింపు**

**భువనగిరి, ఆగస్టు 18 (జనం సాక్షి)**
ఆర్థిక ఇబ్బందులతో చదువును కొనసాగించలేని పరిస్థితిలో ఉన్న ముగ్గురు పేద విద్యార్థులకు యువ టీం కన్వీనర్ సూదగాని రాజు అండగా నిలిచారు. విద్యార్థుల వార్షిక ఫీజు రూ.60 వేల విలువైన చెక్కును ఆయా పాఠశాలల హెడ్‌మాస్టర్లకు అందజేశారు.
స్థానిక మదర్ థెరిసా పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఉగ్గ సిద్ధార్థ్ చరణ్, యూకేజీ విద్యార్థిని సామల ఆరాధ్యతో పాటు శ్రీ చైతన్య పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న తునికి నంద కిషోర్‌ల ఫీజును చెల్లించారు. ఈ సందర్భంగా పాఠశాలల హెడ్‌మాస్టర్లు సురేష్, షౌరెడ్డి చెక్కును స్వీకరించారు.గత 17 ఏళ్లుగా యువ టీం ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న సూదగాని రాజు.. వందలాది మంది నిరుపేద విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, స్టడీ మెటీరియల్ అందిస్తూ విద్యాభ్యాసానికి అండగా నిలుస్తున్నారు. ఈ కార్యక్రమంలో యువ టీం కో-కన్వీనర్లు చల్ల కిషోర్, బెల్లంకొండ సురేష్, సభ్యుడు కుసుమ సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

## ముున్సిపాలిటీలో బుల్లెట్ ట్రైన్ పై తీర్మానం చేయాలి

### అఖిలపక్షాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేత



**సూర్యాపేట (జనంసాక్షి):**
కేంద్ర ప్రభుత్వం ముందుగా ప్రకటించిన బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ ప్రకారం శంషాబాద్ నుండి వయా సూర్యాపేట,అమరావతి చెన్నై వరకు వెళ్లే విధంగా ప్రతిపాదనను కొనసాగించాలని మున్సిపాలిటీ ప్రత్యేక తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని బుల్లెట్ ట్రైన్ సాధన అఖిల పక్ష కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాదికి వినతి పత్రం అందజేశారు. సూర్యాపేటకు అన్యాయం జరగకుండా మొదటగా ప్రకటించిన ప్రకారం బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట విధిగా వెళ్లే విధంగా ఏకగ్రీవ తీర్మానం చేసి ప్రభుత్వానికి అందజేయాలని అఖిలపక్ష నాయకులు కోరారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది మాట్లాడుతూ వర్తక వాణిజ్యపరంగా అభివృద్ధి చెందాలంటే సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ వెళ్లడమే సమంజసమని సభ్యుల అనుమతితో తీర్మానం చేసి వెళ్లే ట్రైన్ సూర్యాపేట మీదుగా వెళ్లేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేయనున్నట్లు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అఖిలపక్షాల నాయకులు కన్వీనర్ ఆరుట్ల జానకి రెడ్డి, కుంట్ల ధర్మార్జున్, మందాది డేవిడ్ కుమార్, జీడి బిక్షం,కర్నాటి కిషన్, కొత్తపల్లి శివకుమార్ రేణుక, పేర్ల నాగయ్య,బూర వెంకటేశ్వర్లు, వీరేంద్ర,నేరెళ్ల మధు, ఎర్ర అఖిల్,బయ్యా మల్లికార్జున్, సట్టు నాగయ్య,సాయి అజయ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

**నేరేడుచర్ల ఆగస్టు 19 (జనంసాక్షి ):**
మండల ఫోటోగ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మచ్చ రవి యూనియన్ జెండాను ఆవిష్కరించి, ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఫోటోగ్రఫీ అనేది సృష్టికి ప్రతిరూపమని, సమాజంలో జరుగుతున్న ప్రతి సంఘటనను సజీవంగా భద్రపరిచే శక్తివంతమైన మాధ్యమమని తెలిపారు. ప్రజల కష్టసుఖాలను, పండుగలను, ఉద్యమాలను కెమెరా ద్వారా చరిత్రగా నిలుపుతున్న ఫోటోగ్రాఫర్ల సేవలు అభినందనీయమని కొనియాడారు.ఫోటోగ్రాఫర్ల హక్కుల పరిరక్షణ, సంఘ బలోపేతానికి అందరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా గౌరవ సలహాదారు శ్రీనివాసచారి, మండల గౌరవ అధ్యక్షులు శ్రీరాములుతో పాటు సీనియర్ ఫోటోగ్రాఫర్లు గణేష్, శ్రీనివాస్ రెడ్డి, గౌస్, బెంజిమెన్, మనోహర్, అబ్రహం, సందీప్, శంకర్, చరణ్, మధుబాబు, బుచ్చిబాబు, బాలస్వామి, వినయ్ తదితర ఫోటోగ్రాఫర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దంత సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు



**సూర్యాపేట(జనంసాక్షి):**
చిన్న దంత సమస్యలను కూడా నిర్లక్ష్యం చేస్తే పెద్ద అనారోగ్యాలకు దారితీస్తాయని ప్రముఖ డెంటిస్ట్ డాక్టర్ తోట కిరణ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్డులో గల మణి దంత వైద్యశాల 16వ వార్షికోత్సవం సందర్భంగా రెండు రోజులపాటు నిర్వహించే ఉచిత దంత వైద్య శిబిరంలో డాక్టర్ టి.అలేఖ్యతో కలిసి ఆయన దంత పరీక్షలు నిర్వహించి మాట్లాడారు.పళ్ళలో నొప్పి, చిగుళ్ళ నుండి రక్తం రావడం, నోటి దుర్వాసన వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు.క్రమం తప్పకుండా ఏడాదికి కనీసం రెండు సార్లు డెంటల్ చెకప్ చేయించుకోవాలని సూచించారు.తీపి పదార్థాలు తినడం తగ్గించాలని,పొగాకు, గుట్కా వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని,సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు.వివిధ దంత సమస్యలకు ప్రస్తుతం అనేక రకాల ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు.తమ హాస్పిటల్ నందు రెండు రోజులపాటు నిర్వహించే ఉచిత దంత వైద్య శిబిరాన్ని సూర్యాపేట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

## మాతృమూర్తి మరణం బాధాకరం

### టీయూడబ్ల్యూజే ఐజేయు డివిజన్ ఉపాధ్యక్షుడు ఖాజా మొహినూద్దీన్

**కొండమల్లేపల్లి, ఆగస్టు 19 (జనంసాక్షి):**
తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరాహత్ అలీ మాతృమూర్తి బషారత్ ఉన్నీసా బేగం మృతి చెందడం ఎంతో బాధాకరమని టీయూడబ్ల్యూజే ఐజేయు దేవరకొండ డివిజన్ ఉపాధ్యక్షుడు ఖాజా మొహినూద్దీన్ అన్నారు. అనంతరం ఆమె పార్థివదేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దివంగత మాతృమూర్తి బషారత్ ఉన్నిసా బేగం ఆత్మకు శాంతి చేకూరాలని ఆమె కుటుంబాన్ని ఈ కష్టకాలంలో భగవంతుడు ధైర్యం నింపాలని అయన ప్రార్థించారు. బషారత్ ఉన్నిసా బేగం మరణం చెందడం అత్యంత విషాదకరం అన్నారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు అయన పేర్కొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత



**సూర్యాపేట(జనంసాక్షి):**
ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న వీర్లపాటి శ్రీనివాస్ కుమార్తె వీర్లపాటి జయశ్రీ కి ఉన్నత చదువులకు పేదరికం అడ్డంకి కావడంతో బుధవారం సూర్యాపేట ఆర్యవైశ్యులు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ పేద ఆర్యవైశ్య విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రతి ఆర్యవైశ్యుడు సహకరించాలని అన్నారు. ప్రతిభ గల విద్యార్థుల చదువులకు పేదరికం అడ్డుకావద్దని అన్నారు.భవిష్యత్తులో ఉన్నత స్థాయి కి ఎదగాలని ఆకాంక్షించారు.అనంతరం వీర్లపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ తన కుమార్తె ఉన్నత విద్యకు ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బండారు రాజా,పోతుగంటి వెంకటేశ్వర్లు, తప్పీ గాంధీ, కలకోట లక్ష్మయ్య,వెంపటి శబరినాథ్,ఉప్పలంచు కృష్ణ,చల్లా సత్యనారాయణ, చల్లా పాండయ్య,చిత్తలూరి శ్రీధర్ రావు,ప్రతాపని చక్రధర్,గుండా శ్రీధర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ఆత్మకూర్ నూతన గ్రామ శాఖ అధ్యక్షుడిగా భాస్కర్ గౌడ్



**ఆత్మకూర్ (ఎం) జనం సాక్షి ఆగస్టు (19)**
కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కందడి అనంతరెడ్డి ఆధ్వర్యంలో అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ శాఖ అధ్యక్షులు ని నియమించడం జరిగింది. ఆత్మకూర్ గ్రామ శాఖ అధ్యక్షుడి గా దొంతరబోయిన భాస్కర్, పల్లెర్ల, లోడి లింగ స్వామి, కోరిటికల్, కృష్ణ, మరియు వివిధ గ్రామాల కు గ్రామ శాఖ అధ్యక్షులు ని నియమించారు.

## దశ దినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భగత్ కుమార్

**హాలియా జనం సాక్షి ఆగస్టు 19**
నిడమనూరు మండలం, నారమ్మ గూడెం గ్రామానికి చెందిన కోట సైదులు గారి కుమారుడు కోట కిరణ్ గారి దశదిన కర్మ కార్యక్రమం లో పాల్గొని వారి చిత్ర పటానికి నివాళులర్పించిన ×మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ అనంతరం రేగులగడ గ్రామం మాజీ సర్పంచ్ జంగిలి రాములు ఆహ్వానం మేరకు తేనేటి విందులో పాల్గొన్నారు గ్రామస్తులతో కలిసి ముచ్చటిస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు 2028 బి ఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి తర్వాత ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు . ఈ కార్యక్రమంలో బిక్శ్య నాయక్,రాంఅంజయ్య, బైరెడ్డి సత్యనారాయణ రెడ్డి, గడ్డం సత్యనారాయణ రెడ్డి, నన్నెబోయినా సత్యనారాయణ,లకుమాల మధు బాబు, లకుమాల లింగయ్య, గడ్డం వెంకటేశ్వర్ రెడ్డి,బైరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రావుల సైదులు, కోట సైదులు,కోట రమేష్, కోట రాజు, మాతంగి శ్రీనివాస్ రావుల సుమన్,చిట్యాల శేఖర్ తదితర గ్రామ నాయకులు పాల్గొన్నారు..





## ఎల్ఓసి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే కుంభం



**వలిగొండ, ఆగస్టు 19 (జనంసాక్షి)**
మండలంలోని నాతాళ్ళగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మస్కు బుచ్చయ్య కుమారునికి వారం రోజుల క్రితం నిమ్స్ హాస్పిటల్ హైద్రాబాద్ లో సర్జరీ అయినది కావున భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి 2 లక్షల 50 వేల రూపాయల ఎల్ ఓ సి చెక్ అందజే?శారు. కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకి ధన్యావాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉలిపే మల్లేశం , మాజీ ఎంపీటీసీ ఉద్దగిరీ భాస్కర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మస్కు నరసింహ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉద్దగిరి శంకరయ్య, కాంగ్రెస్ నాయకులు కాసుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం

○మున్నేరు వంతెన, సీసీ గోడలు బీఆర్ఎస్ హయాంలోనే మంజూరు
○ఖమ్మం అభివృద్ధి ఘనత పువ్వాడ అజయ్‌కుమార్‌కే దక్కుతుంది
○ఆధారాలతో చర్చకు సిద్ధం: బీఆర్ఎస్ నేతలు







**ఖమ్మం, ఆగస్టు 19 (జనం సాక్షి):**
ఖమ్మం కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన అభివృద్ధి పనులను తమ ఖాతాలో వేసుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పగడాల నాగరాజు, గుండాల కృష్ణ, బి.రెడ్డి నాగచంద్రారెడ్డి మాట్లాడారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం అభివృద్ధికి అనేక పనులు మంజూరు చేశారని తెలిపారు. ఇందుకు సంబంధించిన జీవోలు, మంజూరు ఉత్తర్వులు, అధికారిక పత్రాలను మీడియా ముందు ఉంచారు. మున్నేరు ఇరువైపులా సీసీ గోడలు, సస్పెన్షన్ బ్రిడ్జి, ఖమ్మం మెడికల్ కాలేజీ పరిధిలో అండర్‌గౌండ్ డ్రైనేజీ పనులు 2023లోనే మంజూరయ్యాయని పేర్కొన్నారు.ప్రభుత్వాలు మారిన తర్వాత గతంలో మంజూరైన పనులను కొనసాగించడం ప్రస్తుత ప్రభుత్వ బాధ్యతేనని, అయితే వాటిని తామే తీసుకొచ్చినట్లు ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. తమ ఆరోపణలు తప్పని నిరూపించేందుకు కాంగ్రెస్ నాయకులు ఆధారాలతో రావాలని సవాల్ చేశారు. ఎక్కడికి రమ్మన్నా, ఏ వేదికపైనైనా జీవోలు, ప్రభుత్వ ఉత్తర్వులతో చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు.ఖమ్మం నగర రూపురేఖలను మార్చిన ఘనత మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కే దక్కుతుందని అన్నారు. గొల్లపాడు ఛానల్ అభివృద్ధి, రహదారులు, సెంట్రల్ లైటింగ్, వైకుంఠధామాలు, ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, ప్రధాన కూడళ్ల సుందరీకరణ వంటి పనులు బీఆర్ఎస్ హయాంలో జరిగాయని గుర్తుచేశారు.ఖమ్మం వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ.11.34 కోట్లు కేటాయించిందని తెలిపారు. ప్రజాధనంతో నిర్మించిన మార్కెట్ వసతులను తొలగించి భారీ వ్యయంతో కొత్త నిర్మాణాలు చేపట్టడంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.మైనార్టీల కోసం బీఆర్ఎస్ హయాంలో మంజూరైన షాదీఖానా నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కోరారు. సమావేశంలో కూరాకుల నాగభూషణం, కమర్, బచ్చు విజయ్, బత్తుల మురళి, మక్బుల్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## రాజకీయ పార్టీల ప్రతినిధులు అవగాహన కల్పించాలి

### కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట (జనంసాక్షి):**
ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా రాజకీయ పార్టీ నాయకులతో పోస్ట్ డ్రాఫ్ట్ కార్యకలాపాలు, డ్రాఫ్ట్ పబ్లికేషన్ గురించి బుధవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ చర్చించారు.పోస్ట్ డ్రాఫ్ట్ అప్లికేషన్ అయిన తర్వాత చేయవలసిన ప్రక్రియను రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించడం జరిగింది. సర్ లో డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఓటర్ లిస్టులో ఏమైనా సందేహాలు, ఫిర్యాదులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులకు డ్రాఫ్ట్ రోల్ అందించడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు రూల్స్ పై ప్రజలకు అవగాహన కల్పించాలని,ప్రక్రియ సజావుగా జరుగుటకు రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, సి సెక్షన్ సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు చకిలం రాజేశ్వరరావు,చల్లమల్ల నరసింహ,ఎండి అబిద్,స్టాలిన్, సత్యనారాయణ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దరావులపల్లిలో యువకుడి ఆత్మహత్య

**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 19 (జనం సాక్షి):**
మండలంలోని పెద్దరావులపల్లి గ్రామ పరిధిలో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ జగన్ తెలిపిన వివరాల ప్రకారం.. బట్టుగూడెం గ్రామానికి చెందిన మధు (30) మధుమేహంతో బాధపడుతూ ఆరోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఇంటి నుంచి వెళ్లాడు. అదేరోజు పెద్దరావులపల్లి పరిధిలోని కుంకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి కోరే నర్సింహా ఫిర్యాదు మేరకు పోచంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## దత్తప్పగూడెంలో మహిళా సంఘ భవనానికి శంకుస్థాపన

**మోత్కూరు ఆగస్టు 19 (జనం సాక్షి)**
మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామంలో మహిళా సంఘ భవన నిర్మాణానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ శంకుస్థాపన చేశారు. మహిళల సంక్షేమం, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలకు భవనం ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. మహిళా సంఘాల ద్వారా పొదుపు, రుణాలు, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవాలని సూచించారు. గ్రామంలో మహిళల అవసరాలకు అనుగుణంగా సంఘ భవనాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# ఆర్ అండ్ ఆర్ భూ సేకరణ కోసం రూ. 206కోట్ల నిధులు విడుదల

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

**భువనగిరి , ఆగస్టు 19 (జనంసాక్షి ప్రతినిధి)**
బస్వాపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామమైన బి.ఎన్. తిమ్మాపురం గ్రామస్తులు ఈ రోజు స్థానిక సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి కుంభం అనిల్ కుమార్ రెడ్డి ని క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్అండ్ఆర్, భూసేకరణ కోసం రూ.206 కోట్ల నిధులు విడుదల కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.అనంతరం ఎమ్మెల్యే తో కలిసి గ్రామస్థులు ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తాకు చేరుకుని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బస్వాపూర్ రిజర్వాయర్ కోసం భూములు కోల్పోయిన రైతులు, నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయడమే తన ప్రధాన లక్ష్యమని అన్నారు. గతంలో ఆర్అండ్ఆర్, భూసేకరణకు అవసరమైన నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం బి.ఎన్. తిమ్మాపురం గ్రామస్థుల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి రూ.206 కోట్ల ఆర్అండ్ఆర్, భూసేకరణ నిధులను విడుదల చేశారని తెలిపారు. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి భువనగిరి నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.బస్వాపూర్ ప్రాజెక్టు పూర్తయితే భువనగిరి, వలిగొండ, నకిరేకల్, రామన్నపేట, తుంగతుర్తి ప్రాంతాల రైతులకు సాగునీరు అందుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మూసీ మురుగు నీటిపై ఆధారపడకుండా గోదావరి జలాలతో రైతులు సాగు చేసుకునేలా బస్వాపూర్ ప్రాజెక్టును పూర్తి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో బస్వాపూర్ రిజర్వాయర్‌లో ఐదు టీఎంసీల నీటిని నింపి రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కెనాల్ ద్వారా దిగువ ప్రాంతాలకు నీరు చేరేందుకు నేషనల్ హైవే వద్ద అవసరమైన పనులు చేపట్టామని, బునాదిగాని, ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వల పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు.బస్వాపూర్ ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడంతో పాటు, నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి-రవికుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖా-బాబురావు, ఆత్మ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పోతంశెట్టి మంజుల-వెంకటేశ్వర్లు, ఖంఖా చైర్మన్లు సతీష్ పవన్, శ్యామ్ గౌడ్, పట్టణ కౌన్సిలర్లు, భువనగిరి నియోజకవర్గంలోని మండలాల అధ్యక్షులు,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బి.ఎన్. తిమ్మాపురం గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు





## సాతానిగూడెంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

### పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నాం :గ్రామ సర్పంచ్ రెడ్యా నాయక్

కామేపల్లి,ఆగస్టు 19 (జనంసాక్షి):



పరిసరాల పరిశు భ్రతతోనే ప్రజల ఆరోగ్యం భద్రంగా ఉంటుందని, గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ ముఖ్య ధ్యేయమని సాతానిగూడెం గ్రామ సర్పంచ్ రెడ్యా నాయక్ తెలిపారు. మండల పరిధిలోని సాతానిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో బుధవారం పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించారు. ఈ పారిశుధ్య పనులను గ్రామ సర్పంచ్ రెడ్యా నాయక్, పంచాయతీ కార్యదర్శి లావణ్య దగ్గరుండి పర్యవేక్షించారు.?ఈ సందర్భంగా కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు,డ్రైనేజీల్లో నీరు సజావుగా సాగేలా మల్టీపర్పస్ వర్కర్లతో ప్రత్యేకంగా పూడిక తీత పనులను చేపట్టారు. ఈ పనులను పరిశీలించిన అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ. డబుల్ బెడ్‌రూమ్ కాలనీవాసులకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ముందస్తు చర్యగా ఈ పారిశుధ్య డ్రైవ్‌ను చేపట్టినట్లు తెలిపారు. కాలనీలో ఎక్కడా మురుగు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.?గ్రామంలో ఎదురవుతున్న ప్రాథమిక సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి,వాటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు పంచాయతీ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తోందని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలు కూడా ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను వీధుల్లో వేయకుండా పంచాయతీ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, మల్టీపర్పస్ వర్కర్లు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



### కొత్త లింగాల కాంగ్రెస్ నూతన కమిటీ ఎన్నిక అధ్యక్షుడు ఉపాధ్యక్షులు కార్యదర్శులను ఘనంగా సత్కరించిన జిల్లా మండల నాయకులు

కామేపల్లి,ఆగస్టు 19 (జనంసాక్షి):

ఇల్లందు నియోజకవర్గం కామేపల్లి మండలం కొత్త లింగాల గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ అధ్యక్షునిగా పగిడిపల్లి కాటయ్య, ఉపాధ్యక్షునిగా ఎరకల రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో వారిని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని, శాలువాలతో ఘనంగా సత్కరించారు.?ఈ కార్యక్రమంలో కామేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు,జిల్లా సెక్రటరీ షేక్ ఫతే మహమ్మద్,జిల్లా నాయకులు తోటకూరి శివయ్య మాట్లాడారు. పార్టీ బలోపేతానికి నూతన కార్యవర్గం అంకితభావంతో పనిచేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎల్లపల్లి శేషగిరిరావు,బైరెడ్డి యుగంధర్ రెడ్డి, కమటం వెంకటేశ్వర్లు, దుద్దుకూరి నాగేశ్వరరావు, గొడవర్తి సత్యనారాయణ, వార్డు మెంబర్ బొట్టు సతీష్, నాయకులు పండగ కోటి,గుండ్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



### కామేపల్లిలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సీనియర్ ఫోటోగ్రాఫర్లకు ఆత్మీయ సన్మానం

కామేపల్లి,ఆగస్టు 19 (జనంసాక్షి):

తెలంగాణ రాష్ట్ర ఫోటోగ్రాఫర్స్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కామేపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో 'ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ' వేడుకలను బుధవారం కొత్త లింగాల వద్ద అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రాంగణంలో సంఘం జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.? ఈ వేడుకలకు మండల ప్రెసిడెంట్ వరికొల్లు ఉపేందర్, సెక్రటరీ షేక్ జహీర్, ట్రెజరర్ వరికొల్లు నగేష్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న అనేక ఘట్టాలను, మధుర జ్ఞాపకాలను తమ కెమెరాల్లో బంధించి భవిష్యత్తు తరాలకు అందించే ఫోటోగ్రాఫర్ల సేవలు అభినందనీయమని కొనియాడారు.

**సీనియర్లకు ఘన సన్మానం**

రంగంలో సుదీర్ఘకాలంగా సేవలు అందిస్తూ, సంఘం అభివృద్ధికి కృషి చేసిన సీనియర్ ఫోటోగ్రాఫర్లను ఈ సందర్భంగా శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో సీనియర్ ఫోటోగ్రాఫర్లు శ్రీను (ముచ్చర్ల), రాఘవయ్య (పండితాపురం), హుస్సేన్ (గోవిందరాల), కామా వెంకన్న (కామేపల్లి),బండి వెంకన్న (కామేపల్లి)లతో పాటు ప్రతికూల పరిస్థితులను తట్టుకుని రంగానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన మహిళా ఫోటోగ్రాఫర్ షేక్ జహీరా బేగం ఉన్నారు. ఈ వేడుకల్లో అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి వరికోల్లు లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షులు రాయల రాఘవయ్య ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. వారితో పాటు సంఘ సభ్యులు గురుమూర్తి,శంకర్, జలీల్,రవీందర్, మహేందర్,ఆరిఫ్, కోటి,రవి,సాయి మండలంలోని ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రోడ్డు నిబంధనలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం

- కాటేపల్లి 'ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్'లో రోడ్డు భద్రతా అవగాహన సదస్సు
- పాల్గొన్న మోటకొండూరు ఎస్సై కుమారస్వామి, యాదగిరిగుట్ట ట్రాఫిక్ సీఐ కృష్ణ

మోటకొండూరు, ఆగస్టు 19(జనంసాక్షి):

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని, అప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు సూచించారు. మోటకొండూరు మండల పరిధిలోని కాటేపల్లిలో ఉన్న ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మోటకొండూరు ఎస్సై కుమారస్వామి, యాదగిరిగుట్ట ట్రాఫిక్ సీఐ కృష్ణ తమ సిబ్బందితో కలిసి హాజరై, కంపెనీ ఉద్యోగులకు ట్రాఫిక్ నిబంధనలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు తప్పనిసరిగా సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్ (ముగ్గురు ప్రయాణించడం), సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రాణాపాయమని హెచ్చరించారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వరాదని, మద్యం సేవించి (డ్రంక్ అండ్ డ్రైవ్) లేదా అతివేగంగా (రాష్ డ్రైవింగ్) వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తమ వెంట తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ కాపీ ,మరియు ఇన్సూరెన్స్ తదితర ధృవీకరణ పత్రాలను ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీ ఉద్యోగులు పాల్గొన్నారు.




### మద్దులపల్లిలో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

## వేడుకలు జయప్రదం చేయాలి

### మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు పిలుపు

కామేపల్లి,ఆగస్టు19 (జనంసాక్షి):

దేశ ఆధునీకరణకు, సాంకేతిక విప్లవానికి బాటలు వేసిన భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఈ నెల 20వ తేదీన మద్దులపల్లి గ్రామంలో అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించనున్నట్లు కామేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు.?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధికి రాజీవ్ గాంధీ అందించిన సేవలు అమోఘమైనవని, ఆయన ఆశయాలను స్మరించుకుంటూ ఈ జయంతి వేడుకల లో అత్యంత వైభవంగా పాల్గొనాలని వారు అన్నారు కార్యకర్తలను చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ శ్రేణులందరిపై ఉందన్నారు. మద్దులపల్లి వేదికగా జరిగే ఈ కార్యక్రమానికి కామేపల్లి మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు,ఉప సర్పంచులు,వివిధ హోదాల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు గ్రామ శాఖ అధ్యక్షులు స్వచ్ఛందంగా,భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. అందరూ సమన్వయంతో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



## అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయాలి

### ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి

ఖమ్మం, ఆగస్టు 19 (జనం సాక్షి):

దిశ కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి అధ్యక్షతన ఖమ్మం కలెక్టరేట్‌లో దిశ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై యాక్షన్ టేకన్ రిపోర్టును పరిశీలించారు. ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు పూర్తి ప్రయోజనం అందించాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల పనులను వేగవంతం చేసి భూసేకరణ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గురుకులాలు, పాఠశాలల్లో ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి విద్య, ఆహారం, పరిశుభ్రతను పరిశీలించాలని అన్నారు. సన్నబియ్యం పంపిణీలో అక్రమాలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. అమృత్ 2.0 పనులను వేగవంతం చేసి విలీన ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎంపీ ల్యాడ్స్, డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల లోటుపాట్లను పరిష్కరించాలని ఆదేశించారు. ఖమ్మం రైల్వే స్టేషన్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి డిసెంబర్ 2026లోగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ సూచించారు. జిల్లాలో రహదారులు, సాగునీరు, విద్య, వైద్యం, పంచాయతీరాజ్, సంక్షేమ పథకాల అమలుపై అధికారులు వివరాలు సమర్పించారు. జిల్లాలో 1.79 లక్షల మందికి నెలకు సుమారు రూ. 46 కోట్ల పింఛన్లు అందుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద 70,620 గ్యాస్ కనెక్షన్లు అందించామని, 4.73 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్, జిల్లా అధికారులు, నామినేటెడ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ సంస్థ మనుగడకు ఎస్ డబ్ల్యూ ఎఫ్ ను బలపరచండి

● కార్మిక ఐక్యత,పోరాటాల పట్ల అవిశ్వాసం ఉన్న ఏకైక సంఘం ఆర్టీసీ ఎస్ డబ్ల్యూ ఎఫ్ మాత్రమే

● ఎస్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర జనరల్ బాడీ లో సిఐటియు అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు పిలుపు

**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 19 (జనం సాక్షి)** ఆర్టీసీలో జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికలు 38 వేలమంది ఆర్టీసీ కార్మికుల భవిష్యత్తు ను నిర్ణయించడానికని అందువల్ల కార్మిక సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పోరాడుతూ కార్మిక హక్కుల పరిరక్షణ ఆర్టీసీ సంస్థ రక్షణే ధ్యేయంగా ఐక్య పోరాటాల సారథిగా ఉన్న స్టాఫ్ అండ్ వర్కర్స్ పెడరేషన్ ను ఆర్టీసీ కార్మికులందరూ బలపరచాలని భారత కార్మిక సంఘాల కేంద్రం(సిఐటియు) అఖిలభారత కోశాధికారి ఎం.సాయిబాబు పిలుపునిచ్చారు.

బుధవారం ఉదయం ఖమ్మం లోని మంచికంటి హాల్లో రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు అధ్యక్షతన ఏర్పాటైన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో సాయిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభో పన్యాసం చేశారు.సమావేశంలో ముందుగా వీరాంజనేయులు సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా ప్రతినిధులందరూ మౌనం పాటించి నివాళు లర్పించారు. అనంతరం సాయిబాబు ప్రసంగిస్తూ 2019లో ఆనాటి ప్రభుత్వం కార్మిక సంఘాల పై ఆంక్షలు విధిస్తే ఆర్టీసీ లోని కార్మిక సంఘాలన్నీ మౌనం దాల్చాయని కేవలం ఎస్ డబ్ల్యూఎఫ్ మాత్రమే తన శక్తి మేరకు కార్మిక సమస్యలపై స్పందించి పోరాడిందన్నారు.ఎస్ డబ్ల్యూ ఎఫ్ సుదీర్ఘకాల పోరాటాల వల్లనే 2026 లో సమ్మె జరిగిందన్నారు.త్వరలో జరగనున్న గుర్తింపు ఎన్నికల్లో కార్మికుల వైపు నిలిచే కార్మిక సంఘం కావాలా? ప్రభుత్వానికి,యాజమాన్యాలకు అనుకూలంగా ఉండే సంఘాలు కావాలా కార్మికులు ఆలోచన చేయాలన్నారు.ఆర్టీసీలో కార్మికులు రిటైర్ అయ్యి ఏళ్ళు గడుస్తున్నా వారి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక పోవడం అత్యంత



బాధాకరమన్నారు.ఆర్టీసీకి నష్టాలు వస్తున్నాయి అంటే అది ప్రభుత్వ విధానాల మూలంగానే అన్నారు.పెరుగుతున్న డీజిల్ రేట్లు బస్సు విడిభాగాల రేట్లు ప్రభుత్వాల విధానాల ఫలిత మేనని కానీ నష్టాల పేరుతో కార్మికులపై పనిభారాలు పెంచడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే పెంచిన పనిభారాలు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివిఎస్ రావు కార్యదర్శి నివేదిక ప్రవేశ పెడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల పని పరిస్థితులు, పెరిగిన పనిభారాలు సమస్యల పట్ల యూనియన్ల వైఖరి,విలీనం అంశం, యాజమాన్యం అంగీకరించి అంశాల అమలు విషయాలు వివరించారు. ప్రభుత్వం అంగీకరించిన ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం అంశం పట్ల విలీనం సమస్యపై సమగ్రమైన అధ్యయనం చేసి స్పష్టమైన వైఖరి తో ఉన్న ఏకైక సంఘం ఆర్టీసీలో ఎస్ డబ్ల్యూ ఎఫ్ మాత్రమే అన్నారు.బ్రెడ్ విన్నర్ స్కీమ్ అంశాన్ని ఎజెండాలో చేర్చడం ద్వారా వారు అపాయింట్మెంట్ అయిన డేట్ నుండే రెగ్యులర్ చేయాలని చర్చలలో అంగీకరింప చేశామని,సహజ మరణానికి కూడా 10 లక్షలు వచ్చే విధంగా




యాజమాన్యం దగ్గర రిప్రజెంట్ చేసి యూబీఐ ద్వారా ఒప్పించామన్నారు.అదేవిధంగా జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు కేవలం కండక్టర్లే కాకుండా డ్రైవర్ల కేటగిరి మెకానికల్ కేటగిరి నుంచి కూడా పరీక్ష రాసేందుకు అవకాశం ఇవ్వాలని ఒప్పించా మన్నారు.ఆర్టీసీలోని అన్ని సమస్యల పట్ల స్పష్టమైన అవగాహన,స్పందించే ఏకైక సంఘం ఎస్ డబ్ల్యూ ఎఫ్ మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీలో జరగబోయే గుర్తింపు ఎన్నికల్లో గెలిచిన సంఘానికి విలీన కమిటీలో ప్రాతినిధ్యం కల్పిస్తామని యాజమాన్యం ప్రకటించిందన్నారు.విలీనం ప్రతిపాదన పట్ల ఏపీఎస్ఆర్టీసీలో మాదిరిగా విలియం తర్వాత సమస్యలు రాకుండా సమగ్రమైన అధ్యనం చేసిన ఏకైక సంఘంగా ఎస్ డబ్ల్యూఎఫ్ నిలిచిందని అందువల్ల జరగబోయే గుర్తింపు ఎన్నికల్లో ఎస్ డబ్ల్యూఎఫ్ గెలుపు కార్మిక వర్గానికి అవసరమన్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నివేదికపై వివిధ రీజయన్ ల నుండి ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. ఖమ్మం పాత బస్ స్టేషన్ నుండి మంచికంటి హాల్ వరకు ఆర్టీసీ కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు.

# ఆశ్రమ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఉపసర్పంచ్

**బూర్గంపహాడ్ ఆగస్టు 19 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను స్థానిక ఉపసర్పంచ్ గుండె వెంకన్న బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యత, వంటగది పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యతను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గుండె వెంకన్న మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. పాఠశాలలో



ప్రతిరోజూ మెనూ ప్రకారం రుచికరమైన, పరిశుభ్రమైన, పౌష్టికాహారాన్ని అందించాలని ప్రధానోపాధ్యాయులు, వంట సిబ్బందికి సూచించారు. భోజనం తయారీలో ఎలాంటి అలసత్వం వహించరాదని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, మంచినీటి వసతి, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, హాస్టల్ వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పాఠశాలలో ఉన్న చిన్నపాటి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# కోర్టు తీర్పుతో నిజం గెలిచింది.. బీఆర్ఎస్ శ్రేణుల్లో హర్షాతిరేకాలు

**- రేగా కాంతారావుపై నమోదైన కేసు కొట్టివేత: కేవీ రమణ**

**బూర్గంపహాడ్ ఆగస్టు 19 (జనంసాక్షి)** బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై నమోదైన కేసును తెలంగాణ హైకోర్టు కొట్టివేసిందని బీఆర్ఎస్ నాయకుడు కే.వి. రమణ తెలిపారు. ఈ మేరకు హైకోర్టులో క్వాష్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం న్యాయస్థానం తీర్పు వెలువరించిందని ఆయన పేర్కొన్నారు. కేసు కొట్టివేతపై



హైకోర్టు న్యాయవాది ఎం. సాంబశివరావు మీడియాకు వివరాలు వెల్లడించడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. కోర్టు తీర్పుతో నిజం గెలిచిందని కే.వి. రమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేగా కాంతారావుపై అసత్య ఆరోపణలు, అక్రమ కేసులు బనాయించి ప్రజాక్షేత్రంలో గందరగోళం సృష్టించేందుకు కొందరు కుట్రలు చేశారని ఆయన ఆరోపించారు. అయితే న్యాయస్థానం తీర్పుతో ఆయనపై వచ్చిన ఆరోపణలకు తెరపడిందని, మచ్చలేని నాయకుడిగా ప్రజల్లోకి మరింత ధైర్యంగా వస్తారని అన్నారు. పినపాక నియోజకవర్గ అభివృద్ధి రేగా కాంతారావుతోనే సాధ్యమని, ఆయన వెంట కార్యకర్తలు రామదండులా అండగా ఉంటారని కే.వి. రమణ స్పష్టం చేశారు. తమ నాయకుడిపై ఇకపై అసత్య ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని ప్రత్యర్థులను హెచ్చరించారు. కోర్టు తీర్పు బీఆర్ఎస్ కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని తెలిపారు.

## హైకోర్టు తీర్పుతో బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు

**పినపాక, ఆగస్టు19(జనం సాక్షి):** పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును హైకోర్టు ఈరోజు కొట్టివేయడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలంలోని బీఆర్ఎస్ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఈ సందర్భంగా మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పినపాక మండలం బయ్యారం ప్రధాన రహదారిపై, బీఆర్ఎస్ కార్యాలయం వద్ద బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, హైకోర్టు తీర్పు తమకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. రేగా కాంతారావుకు మద్దతుగా నినాదాలు చేస్తూ, పరస్పరం స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు సర్పంచ్ నాగరాజు పరుగులు

**- అంగన్వాడి మరమ్మతుల పరిశీలన.. పాండవ బస్తీలో రోడ్లు, డ్రైనేజీపై ప్రత్యేక దృష్టి..**

**దుర్గం పహాడ్ ఆగస్టు 19 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ గ్రామాభివృద్ధే ధ్యేయంగా బూర్గంపహాడ్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మందా నాగరాజు అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో యాదవ బజార్‌లోని అంగన్వాడి కేంద్రం?3లో కొనసాగుతున్న మరమ్మతు పనులను సర్పంచ్ మందా నాగరాజు పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తి చేసి చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కేంద్రానికి ఆకర్షణీయమైన రంగులు వేయించి, చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు.

**- పాండవ బస్తీపై ప్రత్యేక దృష్టి**

పాండవ బస్తీలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీ వ్యవస్థను సర్పంచ్ పరిశీలించారు. వర్షాల కారణంగా రోడ్లపై నిలిచిన నీటిని పంచాయతీ సిబ్బందితో కలిసి తొలగించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలని సిబ్బందికి సూచించారు. పాండవ బస్తీలో సీసీ రోడ్ల మరమ్మతులతో పాటు సైడ్ డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని సర్పంచ్ నాగరాజు తెలిపారు. గ్రామంలోని ప్రతి






ప్రాంతంలో అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తూ బూర్గంపాడును ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంపత్ శ్రీనివాస్, అంగన్వాడి టీచర్ రత్నకుమారి, పాండవ బస్తీ నివాసులు పుట్టి రమణ, బర్ల సాయి, పంచాయతీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## మధిరలో యూరియా కొరత

మధిర, ఆగస్టు 19 (జనంసాక్షి):

మధిర, పరిసర గ్రామాలలో రైతాంగం యూరియా దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న తేలికపాటి వర్షాలకు పత్తి, వరి ఇతర పంటలకు కొరకు రైతులు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన యాప్ ద్వారా యూరియా కట్టలు బుక్ చేసుకోవడం కొరకు ఎంత ఎదురు చూస్తున్నప్పటికీ స్థానికంగా ఉన్న షాపుల్లో యూరియా నిలువలు లేకపోవడంతో ఉన్న నిమిషాల వ్యవధిలోనే పూర్తిగా బుక్ కావడం వల్ల రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి మధిర పట్టణానికి మరియు మండల పరిధిలో ఉన్న డీలర్ల వద్ద యూరియా స్టాక్ ఉండేటట్లు తగు ఏర్పాటు చేయాలని సిపిఎం పార్టీ మధిర మండల కార్యదర్శి మంద సైదులు, రైతు సంఘం మండల కార్యదర్శి మందడపు ఉపేంద్రరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు.లేనిపక్షంలో మండలంలోని రైతులు పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతారని హెచ్చరించారు.

## సన్నరకం వరి బోనస్‌కు ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి



అశ్వాపురం ఆగస్టు 19 (జనంసాక్షి):

అశ్వాపురం: 2026-27 వానాకాలం సీజన్‌లో సన్నరకం వరి సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ అందించనున్న నేపథ్యంలో, రైతులు తప్పనిసరిగా అంతర్జాలంలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి చెటర్జీ సూచించారు.ప్రభుత్వం గుర్తించిన బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం-1638, డబ్ల్యూజీఎల్-44, కేఎన్ఎం-7715 వంగడాలు సాగు చేస్తున్న రైతులు తాము విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ వద్దే బిల్లు లేదా రశీదు సమర్పించి నమోదు చేయించుకోవాలని తెలిపారు. నమోదు చేసుకోకపోతే బోనస్ ప్రయోజనం పొందడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున ప్రతి రైతు వ్యక్తిగత బాధ్యతగా నమోదు పూర్తి చేసుకోవాలని అధికారి స్పష్టం చేశారు.

## కేజీబీవీలో డే వాచ్మెన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**మహిళా అభ్యర్థులకు అవకాశం.. 10వ తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి**

అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 19 (జనం సాక్షి)

అన్నపురెడ్డిపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన డే వాచ్మెన్ (మహిళ) పోస్టును భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఉండేటి ఆనంద్‌కుమార్ తెలిపారు.ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునే మహిళా అభ్యర్థులు 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి ఉండటంతో పాటు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అలాగే అన్నపురెడ్డిపల్లి మండల స్థానికత తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. అర్హతలు కలిగిన మహిళా అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ సమగ్ర శిక్ష నిబంధనల ప్రకారం నిర్వహించనున్నట్లు ఎంఈఓ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 22వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు అన్నపురెడ్డిపల్లి కేజీబీవీ పాఠశాలలోని స్పెషల్ ఆఫీసర్‌కు సమర్పించాలని కోరారు. పోస్టుకు సంబంధించిన అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలను అభ్యర్థులు కేజీబీవీ పాఠశాలలో సంప్రదించి తెలుసుకోవచ్చని ఎంఈఓ ఆనంద్‌కుమార్ తెలిపారు.



## ఛాయాచిత్రం ఒక కళ కాలాన్ని భద్రపరిచే అద్భుత మాధ్యమం

కల్లూరు ఆగస్టు 19(జనం సాక్షి)



ప్రపంచ ఫోటోగ్రఫీ డే 187వ వేడుకలను కల్లూరు మండల ఫోటోగ్రాఫర్స్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్లు కేక్ కట్ చేసి ప్రపంచ ఫోటోగ్రఫీ డే శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సీనియర్ ఫోటోగ్రాఫర్లు మాట్లాడుతూ ఛాయాచిత్రం అనేది కేవలం ఒక చిత్రం కాదని, అది ఒక కళ, ఒక జ్ఞాపకం, ఒక చరిత్రకు ప్రతిరూపమని అన్నారు. కాలగర్భంలో కలిసిపోయిన ఎన్నో సంఘటనలను ఒకే ఛాయాచిత్రం ద్వారా భవిష్యత్ తరాలకు అందించడం ఫోటోగ్రాఫర్‌కు మాత్రమే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. జీవితంలో మరచిపోలేని మధుర జ్ఞాపకాలను పదిలంగా భద్రపరిచి, ఎప్పటికీ నెమరువేసుకునేలా చేసేది ఫోటోగ్రఫీ మాత్రమేనన్నారు.సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఫోటోగ్రఫీ రంగంలో కూడా అనేక మార్పులు చోటుచేసుకున్నాయని, అయినప్పటికీ నాణ్యమైన ఛాయాచిత్రం ప్రాధాన్యత ఎప్పటికీ తగ్గదని తెలిపారు. సమాజంలో జరిగే ముఖ్యమైన సంఘటనలు, అభివృద్ధి కార్యక్రమాలు, సాంస్కృతిక వేడుకలు, ప్రజల జీవితాల్లోని ప్రత్యేక ఘట్టాలను కెమెరాలో బంధిస్తూ ఫోటోగ్రాఫర్లు తమ వంతు సేవ అందిస్తున్నారని అన్నారు.ఫోటోగ్రాఫర్లను ప్రభుత్వం గుర్తించి, వారి సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఫోటోగ్రఫీ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారికి బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక సహాయం, పరికరాల కొనుగోలుకు రుణ సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఫోటోగ్రాఫర్లకు వృత్తిపరమైన శిక్షణ, సంక్షేమ పథకాలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల ఫోటోగ్రాఫర్స్ కమిటీ అధ్యక్షులు మోదుగు రాంబాబు, సెక్రటరీ వెంకటేశ్వరరావు, ట్రెజరర్ వెంకట్, సీనియర్ ఫోటోగ్రాఫర్లు చల్లా వెంకటేశ్వరరావు, మెట్రోఅబ్దుల్ హబీబ్, బీవీ, రోజ్ వేణు, మర్రెల వెంకటేశ్వరరావు, వెంకట్, కృష్ణ, డేవిడ్, ప్రభాకర్, వినోద్, రవి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన బీఈడీ ప్రవేశ దరఖాస్తుల గడువు పొడిగింపు

భద్రాచలం ఆగస్టు 19 (జనంసాక్షి)



భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక గిరిజన బీఈడీ కళాశాలలో 2026- 28 విద్యా సంవత్సరానికి రెగ్యులర్ బీఈడీ కోర్సులో ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు. కళాశాలలో మొత్తం 100 సీట్లు ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఏజెన్సీ షెడ్యూల్డ్ ప్రాంత గిరిజన పట్టభద్రులు మాత్రమే ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. డిగ్రీలో కనీసం 40 శాతం మార్కులు సాధించి ఉండాలని, సంబంధిత డిగ్రీ పరీక్షల్లో పొందిన మార్కుల మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మహిళలకు ప్రత్యేక కేటగిరీలో సీట్లు రిజర్వు చేసినట్లు వెల్లడించారు. గిరిజన బీఈడీ కళాశాలలో ప్రవేశానికి సంబంధించిన ప్రాస్పెక్టస్ , దరఖాస్తులు ఉచితంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఏటూరునాగారం, ఉట్నూర్ , మన్ననూరు ఐటీడీఏ కార్యాలయాలతో పాటు భద్రాచలంలోని గిరిజన బీఈడీ కళాశాలలోనూ దరఖాస్తులు, ప్రాస్పెక్టస్ లు పొందవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 8247528404, 8247798370, 9912272959, 9959575539 నంబర్లలో సంప్రదించాలని ఐటీడీఏ పీవో సూచించారు.

## ఐటీడీఏ పీవో బి. రాహుల్ జన్మదిన వేడుకలు..

భద్రాచలం ఆగస్టు 19 (జనంసాక్షి)



గిరిజన సంక్షేమం, అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ 33వ జన్మదిన వేడుకలను ఐటీడీఏ యూనిట్ అధికారులు, సిబ్బంది ఘనంగా నిర్వహించారు. బుధవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో పీవో బి. రాహుల్ కేక్ కట్ చేశారు. అనంతరం అధికారులు, సిబ్బంది ఆయనకు కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పీవో రాహుల్ గిరిజన సంక్షేమం కోసం చేస్తున్న కృషిని అధికారులు అభినందించారు. గిరిజన సంక్షేమ పథకాల అమలులో భద్రాచలం ఐటీడీఏకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు గిరిజనుల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యత కల్పించేందుకు పీవో రాహుల్ చేస్తున్న కృషిని అధికారులు కొనియాడారు. గిరిజన మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించే లక్ష్యంతో 'భద్రగిరి మార్ట్ ' ఏర్పాటుకు కృషి చేయడం, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ట్రైబల్ మ్యూజియం ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం, కోయ భాష, ఆదివాసీ సంస్కృతికి ప్రాధాన్యత కల్పించడం వంటి కార్యక్రమాలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, ఎస్ డీసీ ఆనంద్ కుమార్, ఏవో సున్నం రాంబాబు, ఏపీవో పవర్ వేణు, ఏడీఎంహెచ్ వో సైదులు, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## భద్రాచలంలో వైభవంగా శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణం

భద్రాచలం ఆగస్టు 19 (జనంసాక్షి)

భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. మిథిలా స్టేడియంలోని శ్రీరామ సేవా మండపంలో నిర్వహించిన ఈ కల్యాణ వేడుకకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించి తరించారు. కల్యాణ మహోత్సవంలో భాగంగా ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణంలో అత్యంత కీలకమైన జీలకర్ర-బెల్లం, మాంగల్యధారణ కార్యక్రమాలు భక్తుల హర్షధ్వానాల మధ్య జరిగాయి. కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు, వేద పండితులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

## గాయపడిన వ్యక్తిని పరామర్శించిన సర్పంచ్

బూర్గంపహాడ్ ఆగస్టు 19 (జనంసాక్షి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గోదారమ్మ క్యాంపు గ్రామానికి చెందిన కర్రి నాగేశ్వరరావును సారపాక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్ పరామర్శించారు. ప్రస్తుతం చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నాగేశ్వరరావును కలిసి, జరిగిన సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సర్పంచ్ వెంట మల్లి కృష్ణ, కృష్ణతో పాటు పలువురు గ్రామస్తులు ఉన్నారు.



## ఛాయాచిత్ర కళను గౌరవించాలి.,

దమ్మపేట ఆగస్టు 19(జనంసాక్షి) :



ఛాయాచిత్ర కళను ఫోటోగ్రాఫర్స్ అందరూ గౌరవించాలని సీనియర్ ఫోటోగ్రాఫర్ ఛాయా ఫోటో స్టూడియో పసుపులేటి కృష్ణారావు అన్నారు. బుధవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఫోటోగ్రాఫర్ సభ్యులతో కలిసి ఆయన స్టూడియోలో ఘనంగా నిర్వహించారు.ముందుగా ఫోటోగ్రాఫర్ పితామహుడు లూయిస్ దాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 19 జరుపుకుంటారని, ఫోటోగ్రఫీ కలను గౌరవిస్తూ,మంచి జ్ఞాపకాలను, భావాలను చిత్రాల ద్వారా బంధించి వారి జ్ఞాపకాలను పదిలంగా ఉంచే ఫోటోగ్రాఫర్ల సేవలను అభినందించారు. చారిత్రక సంఘటన, జ్ఞాపకార్థం ఈ వేడుకలు నిర్వహిస్తారని తెలిపారు. కాలానికి అద్దంలా నిలిచే మధుర జ్ఞాపకాలను భద్రపరచడంలో ఛాయాచిత్ర రంగం చాలా గొప్పదని కొనియాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఫోటోగ్రాఫర్లు నల్లగట్ల సత్యంబాబు,ఎస్.కె.రహీం,కట్టం రామకృష్ణ,గట్ల శ్రీనివాసరావు,దాసరోజు రామారావు,దాసరోజు హరీష్,కీసర వెంకటస్వామి,తదితరులు పాల్గొన్నారు.

# గోమోర్ రైతన్నను గోల్లుమనిపించింది !

**అన్నపురెడ్డిపల్లి ఆగష్టు 19 ( జనం సాక్షి )**

రాష్ట్ర ప్రభుత్వం రైతే రాజని పదేపదే చెబుతున్న రైతు మాత్రం తన పంట పండించేందుకు రాత్రి పగళ్ళు కష్టపడినప్పటికీ ఏదో ఒక సందర్భంలో నష్టపోతూనే ఉన్నాడు. ముఖ్యంగా పంట వేసే ముందు ప్రధాన శత్రువు అయిన కలుపు (తుంగ) తోపాటు సొసైటీలో జరుగుతున్న నకిలీలను సైతం ఎదుర్కోవాల్సిందే! ఎటునుండి ఏ శత్రువు దాడి చేస్తాడో! తెలియక కరెంటు సక్రంగా ఉండి ఉండక కాయ కష్టం చేసి చివరికి పంట పండిస్తే ఆ పంట దళారీ వ్యవస్థ మింగేయటం సర్వసాధారణమైంది. ఇటువంటి కఠోర శ్రమలో రైతన్న కష్టపడతు ఉంటే వివిధ రకాల ప్రైవేట్ కంపెనీ యాజమాన్యం సైతం తమ అక్రమ సంపాదన దండుకునే ప్రయత్నంలో భాగంగా ఎరువులను అంటగట్టి అధిక మొత్తంలో దండుకుంటున్నారు. అటువంటి సందర్భంలో రైతన్న పైరుకు పోషకాలను అందించి క్రిమిసమహార ప్రక్రియ మొదలు పెడుతుందా! లేక వేసిన పైరనే నాశనం చేస్తుందా! అన్న విషయంలో తికమక పడినప్పటికీ కంపెనీ యాజమాన్యం మాత్రం ఎరువులను దశలవారీగా వినియోగించుకోవాలని సూచనలు సలహాలు ఏమి ఇవ్వకుండా రైతన్నకు అంటగట్టి వారి చేత వినియోగిస్తున్నారు. ఇటువంటి కార్యక్రమాలపై నిగా పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అగ్రికల్చర్ కి సంబంధించిన అధికార యంత్రాంగాన్ని నియమించి ఎప్పటికప్పుడు ఎరువులు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి అసలేదో నకిలీ ఏదో అన్న తేడాను పరిశీలన చేసి వాటిపై చర్యలు చేపట్టే విధంగా వారికి అథారిటీ కూడా ఇచ్చినప్పటికీ నేటికీ రైతన్న ఎక్కడో ఒకచోట ఎరువుల ద్వారా నష్టపోతున్న సందర్భాలు కనిపిస్తూనే ఉన్నాయి. అటువంటి సంఘటనతో వ్యవసాయం ఆదిలోనే ఎనిమిది వేల రూపాయలతో 8 ఎకరాలకు గడ్డి మందు పిచికారి చేస్తే ఫైర్ నాశనమైందని బోరును విలిపిస్తున్న కంపెనీ యాజమాన్యం మాత్రం తమకు అంటి అంటున్నట్లుగా ముట్టి ముట్టినట్లుగా వ్యవహరిస్తున్న సందర్భాన్ని ఏ అధికారికి చెప్పాలో తెలియక రైతన్న తికమక పడుతున్న ఘటన మండలంలో సంచలనం సృష్టిస్తుంది. అన్నపురెడ్డిపల్లి పట్టణంలోని మన గోమోర్ కంపెనీ నందు వరి పంటలోని గడ్డి నివారణ కొరకు సుమారు ఎనిమిది వేల రూపాయల తో ఈ నెల ఆగష్టు 3/2026వ తారీఖున ఇరువురు రైతన్నలు సుమారు 8 ఎకరాల పంటలపై పిచికారి చేసేందుకు విక్రయం జరిపి వినియోగించినట్లు తెలుస్తుంది. తదుపరి కొన్ని రోజులు గడవక ముందే గడ్డి కలుపు నివారణ కాకపోగా వేసిన పంట ఎర్రబారి పోవటంతో అది గమనించిన రైతన్నలు గోమూర్ కంపెనీ సిబ్బందిని సంప్రదించి వివరించగా చూద్దాములే! అంటూ కాలయాపన చేయటం జరిగిందని ఎన్నిసార్లు వివరించినప్పటికీ స్పందన కరువైందని అబ్బుగూడెం కు చెందిన ఇరువురు రైతన్నలు మీడియా ముందు బోరును విలపించారు. నిజానికి అసలే వర్షాలు అంతంత మాత్రం పంటను వెయ్యాలో లేదో తెలియక రైతన్న కాలంవైపు ఎదురుచూస్తున్న సందర్భంలో ఆరుతడితో చేస్తున్న వ్యవసాయం ఇలా అయిపోవడం బాధాకరంగా ఉందని తక్షణమే ప్రభుత్వం ఆదుకోవా లని మీడియా ముఖ్యంగా తెలపడం జరిగింది.

**గోమోర్ లో అవగాహన లేని సిబ్బందితో ఎరువులు పంపిణీ!?**

వ్యవసాయ పంటలకు ఎరువులే ప్రధానం ఇటువంటి వాటిని ప్రైవేట్ కంపెనీ యాజమాన్యం ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్దిష్టమైన ప్రదేశాలలో భవనాలు నిర్మాణాలు చేపట్టి వాటిలో ఎరువులు మరియు




రసాయనిక క్రిమిసంహార మందులను నిల్వ చేసి వాటిని ప్రభుత్వ అధికారుల ఆదేశాల మేరకు అవగాహన కలిగిన సిబ్బందితో రైతన్నలకు అందించే విధంగా ప్రక్రియ ప్రారంభించాలి. అంతేకాకుండా క్రిమి సమహార మందులు వినియోగించే రీతిని కూడా రైతులకు వివరించి వాటి వల్ల ఉపయోగాలు మరియు నష్టాల అవగాహన పరిచి వాడే విధానాన్ని తీసుకో వాల్సిన జాగ్రత్తలను వివరించే వారిని నియమించి ఎరువులను అందించే విధంగా కార్యక్రమాలు చేపట్టాలి. కానీ వారి ఆదాయాన్ని పెంచుకునే మార్గంలో రైతులు నష్టపోయిన పరవాలేదని కోణంలో వారి రాబడి కోసం ఎరువులను అంటగట్టే పనిలో అవగాహన లేని సిబ్బందిని నియమించి వారి ద్వారా రైతులకు అందిస్తున్నారు. ఇట్టి విషయంపై అన్నపరెడ్డిపల్లి అగ్రికల్చర్ ఏవో అనూష చరవాణి ద్వారా వివరణ కోరగా మేము నిత్యం ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామని అటువంటిది ఏదీ జరగలేదని అయినా రైతులు మా వద్దకు వచ్చి వివరిస్తే మేము చర్యలు తీసుకుంటామని ఎక్కడో జరిగితే మాకు ఎట్లా తెలుస్తుందని అయినా మా సిబ్బంది ఒకరు మెటర్నల్ లీవ్ లో ఉన్నారని వారు ఆరు నెలలుగా సెలవులు ప్రకటించారని అందువల్ల రైతులు మా వద్దకు వచ్చి వివరించాలని తెలిపారు.

## రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు

**భద్రాచలం ఆగష్టు 19 (జనంసాక్షి):**

రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతికి కారణమైన కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ బుధవారం భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివ నాయక్ తీర్పు వెల్లడించారు. 2020లో భద్రాచలంలోని రూపా స్కూల్ ఎదుట కారు, స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న వ్యక్తి మృతి చెందారు. ఘటనపై భద్రాచలం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం నిందితుడిని దోషిగా నిర్ధారించిన న్యాయస్థానం ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది.

### సామాజిక చైతన్య నాటకోత్సవాలకు ఆహ్వానం

**భద్రాచలం ఆగష్టు 19 (జనంసాక్షి)**

సామాజిక ఉద్యమ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్ కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సామాజిక చైతన్య నాటకోత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భద్రాచలంలోని ఐటీడీఏ గిరిజన భవన్ లో రెండు రోజులపాటు నాటక ప్రదర్శనలు జరగనున్నాయి. గురువారం సాయంత్రం 'సంఘం శరణం గచ్ఛామి' నాటకాన్ని ప్రదర్శించనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితం, ఆశయాలు, లక్ష్యాల ఆధారంగా ఈ నాటకాన్ని రూపొందించినట్లు తెలిపారు. అలాగే శుక్రవారం సాయంత్రం 'సత్యశోధన' నాటకాన్ని ప్రదర్శించనున్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే జీవితాలు, ఆశయాలు, లక్ష్యాల ఆధారంగా ఈ నాటకాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. నాటకాలకు కే. దేవేంద్ర రచన అందించగా, శివప్రసాద్ తూము దర్శకత్వం వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## సారపాక రోడ్లపై ఆవుల బెడద బైక్‌ను ఢీకొని వ్యక్తికి గాయాలు

**- అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం**

**బూర్గంపహాడ్ ఆగస్టు 19 (జనంసాక్షి)**





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక ప్రధాన రహదారులపై విచ్చలవిడిగా సంచరిస్తున్న ఆవులు వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. బుధవారం రాత్రి సారపాక బస్టాండ్ వద్ద ఆవులు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో గోదారమ్మ క్యాంపు ప్రాంతానికి చెందిన కర్రి నాగేశ్వరరావు కిందపడిపోయి గాయపడ్డారు. ముఖం, భుజానికి గాయాలు కాగా.. భుజం ఎముకవిరిగినట్లు సమాచారం. రోడ్లపై ఆవుల సంచారంపై పంచాయతీ సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి ఆవుల సంచారాన్ని అరికట్టి, వాటి యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## బంద్ విజయవంతం

**ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి**

**కానిస్టేబుల్ నియామకాల్లో ఆదివాసీ నిరుద్యోగులకు 75 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి**

**అన్నపురెడ్డిపల్లి ఆగష్టు 19 ( జనం సాక్షి )**



ఏజెన్సీ ప్రాంత ఆదివాసీల హక్కులను పరిరక్షించడంతో పాటు పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తుడుందెబ్బ ఆధ్వర్యంలో బుధవారం అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. రాష్ట్ర ఏజెన్సీ బంద్ పిలుపులో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు, దుకాణదారులు స్వచ్ఛందంగా మద్దతు తెలపడంతో మండల కేంద్రంలో బంద్ సంపూర్ణంగా జరిగింది. ఈ సందర్భంగా తుడుందెబ్బ మండల అధ్యక్షుడు కుంజా వెంకటేష్ దొర మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ నిరుద్యోగులకు విద్య, ఉద్యోగ నియామకాల్లో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్‌లో జీవో నంబర్ 109 ప్రకారం ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ అభ్యర్థులకు 75 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీ నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేలా జీవో నంబర్ 3ను పునరుద్ధరించాలని, ఏజెన్సీ ప్రాంత ఆదివాసీల భూమి, హక్కుల పరిరక్షణ కోసం 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంత ప్రజల హక్కులను, నిరుద్యోగ యువత భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆదివాసీ హక్కుల సాధన కోసం భవిష్యత్తులో ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించిన విద్యార్థులు, వ్యాపారులు, దుకాణదారులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు మడివి నాగేంద్రబాబు, సున్నం వెంకటేష్, సుధాకర్, రత్నం బాబు, తాటిబాబు, సవలం గోపాల్, సున్నం నాగప్రసాద్, ఊకే తులసీరామ్, తాటి మహేష్, మడివి సందీప్, మడివి కార్తీక్, తాటి శివకృష్ణ ప్రసాద్‌తో పాటు ఆదివాసీ విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేద గిరిజన విద్యార్థులకు నదీమ్ చేయూత

**బూర్గంపహాడ్ ఆగస్టు 19 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం బత్తులనగర్ మండల పరిషత్ పాఠశాలలో చదువుతున్న 20 మంది నిరుపేద గిరిజన విద్యార్థులకు నదీమ్ ఆర్థిక సహకారంతో పాఠశాల బ్యాగులను పంపిణీ చేశారు. రూప్లా నాయక్ అధ్యక్షతన టీం సంభవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల చదువుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు మరింతగా చేయూతనివ్వాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలల బంద్ ను విజయవంతం చేయండి

భద్రాచలం ఆగస్టు 19 (జనంసాక్షి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా, వారి భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలు తీసుకోవడాన్ని నిరసిస్తూ రేపు నిర్వహించనున్న పాలిటెక్నిక్ కళాశాలల బంద్ ను విజయవంతం చేయాలని ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల రవీందర్ పిలుపునిచ్చారు. జీవో నంబర్ 97ను రద్దు చేయాలని, శక్తి స్కీంను ఉపసంహరించా లని, పాలిటెక్నిక్ విద్యార్థులను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి అనుసంధా నించవద్దని, విద్యార్థి సంఘాలతో చర్చించిన తర్వాతే విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో మౌలిక వసతులు, ల్యాబొరేటరీలు, అధ్యాపకులు, హాస్టళ్లు, స్కాలర్ షిప్ లు, ఫీజు రీయింబర్స్ మెంట్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అన్నారు. బంద్ లో విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సాయికిరణ్, ప్రదీప్, వంశీ, సృజన్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పీడీఎస్ బియ్యాన్ని బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిపై పీడీ యాక్ట్

## పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 19 (జనంసాక్షి)** పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ చేయడం, అంతర్రాష్ట్రాలకు తరలించి బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తూ అక్రమంగా ఆర్థిక లాభాలు ఆర్జిస్తున్న కాజా రామారావు ఏ జయంతి రామారావుపై పీడీ యాక్ట్‌ను అమలు చేసినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా, వీరులపాడు మండలం, ఆంధ్రప్రదేశ్ కు చెందిన నిందితుడు కాజా రామారావు రేషన్ డీలర్లు, వారి ఏజెంట్ల ద్వారా కార్డుదారులకు అందాల్సిన సబ్సిడీ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా సేకరించేలా లబ్ధిదారుల బయోమెట్రిక్ వేలిముద్రలను దుర్వినియోగం చేసి బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయిస్తున్నట్లు తెలిపారు. 2026 ఏప్రిల్ 28 నుంచి మే 26 వరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని కల్లూరు, తల్లాడ, ఎర్రుపాలెం, చంద్రుగొండ పోలీస్ స్టేషన్లలో నిందితుడిపై పీడీఎస్ బియ్యం అక్రమ కొనుగోలు సంబంధించి మొత్తం ఐదు కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఈ కేసుల్లో భారతీయ న్యాయ సంహిత , ఎసెన్షియల్ కమాడిటీస్ యాక్ట్, తెలంగాణ పీడీఎస్ కంట్రోల్ ఆర్డర్స్‌కు సంబంధించిన వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గతంలోనూ ఇదే తరహా కేసులు నిందితుడిపై 2024లో కూడా ఖమ్మం జిల్లాలోని తల్లాడ, కల్లూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో పీడీఎస్ బియ్యం అక్రమ వ్యాపారానికి సంబంధించి మరో రెండు కేసులు నమోదయ్యాయని, అయినప్పటికీ తన అక్రమ కార్యకలాపాలను మార్చుకోకుండా కొనసాగించినట్లు తెలిపారు. ఇలాంటి కార్యకలాపాల ద్వారా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన పేదలకు ఉద్దేశించిన ఆహార భద్రత వ్యవస్థకు తీవ్ర విఘాతం కలుగుతోందని, సమాజానికి అవసరమైన నిత్యావసర వస్తువుల సరఫరా వ్యవస్థను కూడా ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిపై గతంలో పలుమార్లు కేసులు నమోదు కావడంతో పాటు, బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులు జారీ చేసినప్పటికీ తన ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని, ఈ నేపథ్యంలో పీడీ యాక్ట్ అమలు చేసి సత్తుపల్లి రూరల్ సిఐ ముత్తులింగం కాజా రామారావును బుధవారం అదుపులోకి తీసుకోని హైదరాబాద్‌లోని చంచల్‌గూడ సెంట్రల్ జైలు తరలించడం జరిగింది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందాల్సిన బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.



# మధిరలో ఘనంగా 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు



మధిర, ఆగస్టు 19 (జనంసాక్షి): 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఫోటో & వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంగడాల పార్వతి అసోసియేషన్ జెండా ఎగరవేసి సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అంగడాల పార్వతి మాట్లాడుతూసమాజంలో జరిగే ప్రతి చారిత్రక ఘట్టాన్ని, మధుర జ్ఞాపకాలను భవిష్యత్ తరాలకు అందించడంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. సాంకేతికత ఎంత మారినా ఫోటోగ్రఫీకి ఉన్న ప్రాధాన్యత తగ్గలేదని, కళాత్మక దృష్టితో క్షణాలను శాశ్వతం చేసే ప్రతి ఫోటోగ్రాఫర్‌కు అభినందనలు తెలిపారు. జనరల్ సెక్రెటరీ యడవల్లి శ్రీధర్ ఫోటోగ్రఫీ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులను వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలోజిల్లా బాధ్యులు అంగడాల గోపీనాథ్, సాంబశివరావురాంబాబు, ప్రకాష్, విజయరాజు, సంగయ్య, ప్రభాకర్, సురేష్,కోటేశ్వరరావు, స్వరూప్, రవి శరత్, నరేంద్ర, శ్రీనివాసరావు, నరేష్, నాగ సాయి ఫోటోగ్రాఫర్ సభ్యులు, పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**ఖమ్మం రూరల్, ఆగస్టు 19(జనం సాక్షి)** గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు బుధవారం రెండో రోజు కొనసాగాయి. మండలం లోని జలగంనగర్‌లోని ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించిన దీక్షలను వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు నండ్రా ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు పెరుమాళ్లపల్లి మోహన్‌రావు మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిరవధిక సమ్మె చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వల్లమూడి నాగేశ్వరావు సీఐటీయూ, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు పంగా లాలయ్య, అనురాధ, చరణ్, వెంకన్న, వీరబాబు, జయమ్మ, ఉప్పలి వెంకన్న, రాములు, రాంసింగ్, మక్కాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మధిర 14వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం



**మధిర, ఆగస్టు 19 (జనంసాక్షి) :** మధిర పట్టణ అభివృద్ధిపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం 14వ డివిజన్‌లో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ల నిర్మాణానికి సంబంధించి రోడ్ల కొలతలు, ప్రదేశ పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. మధిర పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని నాయకులు తెలిపారు. పట్టణంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు వర్షపు నీరు, మురుగు నీరు సక్రమంగా వెళ్లేలా డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సామినేని సుజాత రామనాథం, వైస్ చైర్మన్ కోన ధనికుమార్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ శ్రీపాలశెట్టి వెంకట్రావు, డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మిరియాల వెంకటరమణ గుప్తా, రంగా శ్రీను, పట్టణ కాంగ్రెస్ నాయకులు బండారు నరసింహారావు, వంగవీటి రాజశేఖర్, సామినేని రామనాథం, సూర్యదేవర కోటేశ్వరావు, ఆవుల కృష్ణ, గుమ్మ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

## మంత్రి పొంగులేటికి సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ వినతి



**ఖమ్మం రూరల్, ఆగస్టు 19:(జనం సాక్షి )** ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే స్థలాలు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కోరారు. ఈ మేరకు బుధవారం పల్లెగూడెం మున్సిపాలిటీ కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరైన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ.. ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో అనేక మంది పేదలు సొంత ఇంటి స్థలం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇళ్ల స్థలాలు లేకపోవడంతో ఒకే గదిలో మూడు, నాలుగు కుటుంబాలు కలిసి జీవించాల్సిన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. నిరుపేద కుటుంబాల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ప్రత్యేకంగా స్థలాలను గుర్తించి అర్హులైన పేదలకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయడంలో భాగంగా ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, వినతిపత్రాన్ని తన సహాయకునికి అందజేసి పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు.

# సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రతకు భరోసా

## రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి





**ఖమ్మం రూరల్, ఆగస్టు 19 (జనంసాక్షి):** సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రతకు భరోసా ఉంటుందని ఖమ్మం రూరల్ ఏసిపి తిరుపతి రెడ్డి అన్నారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలం లోని పొన్నేకల్లు గ్రామం లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 22 సీసీ కెమెరాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాటాడారు..నేరాల నియంత్రణతోపాటు ప్రజలకు మెరుగైన భద్రత కల్పించేందుకు సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ చాలా అవసరమని, సీసీ కెమెరాలు 24 గంటల పాటు నిఘా నేత్రాలుగా పనిచేస్తాయని తెలిపారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, ప్రధాన రహదారులు, కూడళ్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో కెమెరాల ఏర్పాటు వల్ల అనుమానాస్పద కార్యకలాపాలను ఎప్పటికప్పుడు గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన చోటుచేసుకున్నప్పుడు కెమెరాల్లో నమోదయ్యే దృశ్యాలు దర్యాప్తులో కీలక ఆధారాలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రవి కుమార్,రూరల్ సీఐ ముష్కరాజు,కూసుమంచి సీఐ సంజీవ్ కుమార్ ,ఖమ్మం రూరల్ ఎస్సై రాయుడు,గ్రామ సర్పంచ్ కోటి శ్రీనివాసరావు , ఉప సర్పంచ్ పెద్ద పొంగు నరేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి తిలక్ కిషోర్, గ్రామ పెద్దలు తాటికొండ సుదర్శన్ , టి కిషన్ రావు ,జి మోహన్ రావు ,వరగాని వెంకటయ్య , వరగాని మోహన్ రావు ,కే వెంకటరమణ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఆటో, క్యాబ్ డ్రైవర్ల బంద్ పోస్టర్ ఆవిష్కరణ

**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 19 (జనంసాక్షి )**

ఖమ్మం జిల్లా కార్యాలయంలో ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు షేక్ సత్తార్మియా అధ్యక్షతన బుధవారం జరిగిన జేఏసీ సమావేశంలో గౌరవ అధ్యక్షులు పగడాల నాగరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని జీవనభృతి 12000 చెల్లించాలని , సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని , రవాణా రంగంలో ఆటో కార్మికులు ఎంతో కీలకపాత్ర వహిస్తున్నారని తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు వల్ల ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని అన్నారు . ఆటో ఈఎంఐ కిస్తీలు ( ఫైనాన్స్ ) కట్టలేక ఆటోలను అమ్ముకొని రోడ్డున పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు .ఎంతోమంది కార్మికులు ఉపాధి కోల్పోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం మాత్రం స్పందించకపోవడం దుర్మార్గమని అన్నారు . ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం ఎన్నికలలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని ప్రతి ఆటో కార్మికునికి సంవత్సరానికి 12,000 జీవన భృతి వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఆటో కార్మికులు కిరాయిలు లేక అడ్డా ల మీద కూర్చుని ఏ కిరాయి దొరుకుతుందా ఎవరు వస్తారు అని ఎదురుచూస్తున్నారు .అందులో భాగంగా ఖమ్మం జిల్లాలో కూడా రాపిడో లాంటి ప్రైవేట్ సంస్థలు వస్తున్న పరిస్థితి కనిపిస్తుంది . ఇప్పటికే కిరాయిలు లేక ఇబ్బంది పడుతున్న ఆటో కార్మికులకు రాపిడో లాంటి సంస్థలు గుది బండగ మారాయి . రవాణా కార్మికులకు ఓలా ఉబర్ లాంటి ప్రైవేట్ యాప్ రద్దుచేసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టి యు యాప్ ప్రవేశపెడతానని కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం 10 లక్షల రూపాయలు కల్పిస్తానని హామీ ఇచ్చినటువంటి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు . రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న ఇప్పటివరకు రవాణా రంగ కార్మికుల పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రిగాని, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కానీ స్పష్టమైన ప్రకటన చేయకపోవడం వల్ల ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు . పక్కన ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆటో కార్మికులకు జీవన భృతి చెల్లించినప్పుడు మరి తెలంగాణ రాష్ట్రంలో జీవన భృతి ఎందుకు చెల్లించరని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు . ఆటో కార్మికుల ప్రయాణం మొత్తం రోడ్డుమీదనే ఉండటంవల్ల వారి యొక్క జీవనం ప్రశ్నార్థకంగా మారిందని వారి సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఒక సమగ్ర చట్టం చేయాలన్నారు . రవాణా రంగ కార్మికులకు గుది బండగ మారిన 2019 మోటార్ వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని అన్నారు . ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ జీవన భృతి 12000 వెంటనే చెల్లించాలని సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కార్మికులకు అనువైన చోట అడ్డా లు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## ఘనంగా ఫోటోగ్రఫీ డే వేడుకలు

**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు18 (జనంసాక్షి):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాపాల్వంచ ఫోటో వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణం లోని హైస్కూల్ రోడ్డులో గల స్వాతి స్టూడియో వద్ద బుధవారం ప్రపంచ ఫోటోగ్రఫీ డే వేడుకలు ఘనంగా జరిగాయి.

కెమెరా సృష్టికర్త డాగ్యురే చిత్ర పటానికి సీనియర్ ఫోటోగ్రాఫర్ లు రాము, సుభాని లు పూల మాలలు వేసి ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ జెండాను ఎగుర వేశారు.

తెలంగాణ తల్లి గీతాన్ని ఆలపించారు.సాంకేతికతను సద్వినియోగం చేసుకంటూ కష్టమర్లకు నాణ్యమైన సేవలు అందించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సూర్యం, సుధాకర్, భద్రం, శరత్, అప్పారావు, శేఖర్, రాజారావు, చందు, రఫీ, కార్తీక్ , కుమార్ లతో పాటు పట్టణ, మండల వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు..

## కోళ్ల ఫారంపై వీధి కుక్కల దాడి



**చంద్రుగొండ, ఆగస్టు 19 (జనంసాక్షి):**

మండలంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ తీవ్రంగా మారుతోంది. పదుల సంఖ్యలో గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా, పశువులు, కోళ్లపై దాడులు చేస్తూ ఆర్థిక నష్టాన్ని కలిగిస్తున్నాయి.మద్దుకూరులో బుధవారం తెల్లవారుజామున గులాం హుస్సేన్‌కు చెందిన కోళ్ల ఫారంపై వీధి కుక్కలు దాడి చేశాయి. ఫారంలోకి చొరబడిన కుక్కలు కోళ్లను చంపి, కొన్ని కోళ్లను లాక్కెళ్లాయి. ఈ ఘటనలో సుమారు రూ.20 వేల ఆర్థిక నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.వీధి కుక్కల బెడదను నియంత్రించేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# ఓట్ల అనామిల్ లిస్టును, అన్ మ్యాపింగ్ లిస్టులను వెంటనే ఇవ్వాలి

○సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ డిమాండ్..

○ఎన్నికల అధికారి రాముకు వినతిపత్రం..

**ఖమ్మం,ఖమ్మం కార్పొరేషన్, (జనంసాక్షి) :**

ఓట్ల అనామిల్ లిస్టును, అన్ మ్యాపింగ్ లిస్టులను వెంటనే ఇవ్వాలి అని, ప్రచురించిన ఓటర్ల జాబితా లో లోపాలను సరి చేయాలి అని సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం నగర మున్సిపల్ కార్యాలయంలో ఎలక్షన్ ఇంచార్జి రాముకు సర్ మీద వివిధ అంశాలపై సమస్యలతో కూడిన వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ మాట్లాడుతూ ఆగస్టు 17వ తారీఖున సర్ ప్రక్రియలో భాగంగా విడుదల చేసిన ఓటర్ల జాబితా ముసాయిదా లో ఎన్యుమరేషన్ ఫారాలు తీసుకునేటప్పుడు ప్రస్తుతం ఉన్న పాస్ ఫోటోలు తీసుకోవడం జరిగింది కానీ ఓటర్లు జాబితాలో పాత ఫోటోలు వచ్చినాయి అని తెలిపారు. చనిపోయిన వాళ్ళ ఓట్లు కూడా వచ్చాయి అని, డబల్ ఓట్లు కూడా ఈ జాబితాలో వున్నాయి అని ఆరోపించారు.ఒక ఇంట్లోనే ఉన్న ఒకే కుటుంబం ఓట్లు వేరువేరు బూతులలో వచ్చినాయి అని వెంటనే సరి చేయాలి అని డిమాండ్ చేశారు. అలాగే అనామిల్ ఓటర్ల జాబితాను, మరియు అన్ మ్యాపింగ్ ఓటర్ల జాబితాను వెంటనే రాజకీయ పార్టీలకు లిస్టులను అందజేయాలి అని , లీస్టులను తొందరగా అందజేస్తే వెరిఫికేషన్ చేసుకొని ప్రజలందరూ కూడా తమ తమ అర్హత పత్రాలను సమర్పిస్తారు అని, ఓటును కోల్పోకుండా చూసుకుంటారు కావున వెంటనే లిస్ట్ విడుదల చేయాలి అని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బూత్ నెంబర్లు కూడా మార్చడంతో ఓటర్లు అయోమయంలో పడ్డారు అని తెలిపారు. ప్రతి ఇంటికి ఃబూ లు తిరిగి ఓటర్ల అనుమానాలను నివృత్తి చేసే విధంగా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఖానాపురం హవేలీ మండల కార్యదర్శి దొంగల తిరుపతిరావు, సిపిఎం టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, సిపిఎం ఖమ్మం డివిజన్ నాయకులు షేక్ హిమామ్, సిపిఎం నాయకులు ఐ౨ నవీన్, గుమ్మడి బిక్షం, తదితరులు పాల్గొన్నారు.

## కొణిజర్లలో మండల స్థాయి క్రీడా కమిటీ ఎన్నిక

**కొణిజర్ల, (జనంసాక్షి) :**



మండల పాఠశాలల క్రీడల సమావేశం మండల విద్యాశాఖ అధికారి అబ్రహం అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. గత ఏడాది మండల స్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించినట్లే ఈ ఏడాది కూడా సమష్టి సహకారంతో పోటీలను ఘనంగా నిర్వహించాలని అబ్రహం సూచించారు.గత ఏడాది పాఠశాల స్థాయి క్రీడలను సమర్థంగా నిర్వహించిన క్రీడా కమిటీ కన్వీనర్ లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్క వెంకటేశ్వర్లును అభినందించారు. క్రీడల నిర్వహణకు సహకరించిన వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది కూడా అందరూ సహకరించి మండల స్థాయి క్రీడలను విజయవంతం చేయాలని కోరారు. మండల క్రీడా కార్యదర్శి షేక్ రంజాన్ మాట్లాడుతూ కొణిజర్ల మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నీ క్రీడల్లో పాల్గొనాలని కోరారు. మండల స్థాయి క్రీడా పోటీల నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. గత ఏడాది మాదిరిగానే అవసరమైతే సెయింట్ అలోసెస్ పాఠశాల క్రీడా మైదానాన్ని వినియోగించుకునేందుకు సహకరించాలని పాఠశాల యాజమాన్యాన్ని కోరారు. సమావేశంలో మండల పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శిగా షేక్ రంజాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మారతమ్మ, కోశాధికారిగా నక్క వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. సభ్యులుగా శంకర్, గుమ్మిడేల్లి రాంబాబును ఎన్నుకున్నారు. వివిధ యాజమాన్యాల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు సమావేశంలో పాల్గొన్నారు.

## విద్యార్థుల అభ్యసన ప్రమాణాల మెరుగుదలపై దృష్టి సారించాలి

**చంద్రుగొండ, ఆగస్టు 19 (జనం సాక్షి):**

చంద్రుగొండ జెడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్ పరిధి లోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల కాంప్లెక్స్ స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారి ఎం. సూరయ్య ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎంఈఓ ఎం. సూరయ్య మాట్లాడుతూ విద్యార్థుల ప్రాథమిక అభ్యసన సామర్థ్యాలను మెరుగు పరచడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. విద్యార్థుల ప్రారంభ స్థాయి మూల్యాంకన ఫలితాలను విశ్లేషించి, వారి స్థాయికి అనుగుణంగా లక్ష్యాలను నిర్ధారించడంతో పాటు పరిహార బోధన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.చంద్రుగొండ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఉప్పల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రేపల్లెవాడ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాంచందర్ పాల్గొని ఉపాధ్యాయులతో వివిధ అంశాలపై చర్చించారు.విషయ నిపుణులు ఎ. దేవరాం, ఎం. వెంకటేశ్వర్లు, టి. రాధా ఉపాధ్యాయులకు ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం, పాఠశాల అభివృద్ధి సూచికలు, పరిహార బోధన, విద్యార్థుల స్థాయిని బట్టి సమూహాల ఏర్పాటు, లక్ష్మిత బోధన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి వనరులను వినియోగించుకోవడం, పరిహార బోధన కాలపట్టికల అమలు, బోధనా ప్రణాళికల అనుసంధానంపై ప్రాక్టికల్‌గా వివరించారు. అలాగే ఉపాధ్యాయులు విషయాల వారీగా సమూహాలుగా ఏర్పడి పరిహార బోధన సమయంలో చేపట్టాల్సిన బోధనా



విధానాలు, విద్యార్థుల మూల్యాంకనం, వారి అభ్యసన స్థాయికి అనుగుణంగా లక్ష్మిత బోధనపై ప్రదర్శనలు నిర్వహించారు. అభ్యసన స్థాయి పెంపు కార్యక్రమం లక్ష్యాలు, ప్రయోజనాలు, పాఠశాలల్లో అమలు చేయాల్సిన విధానాలపై కూడా చర్చించారు.విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచేందుకు ఉపాధ్యాయులందరూ సమన్వయంతో పనిచేయాలని ఎంఈఓ ఎం. సూరయ్య సూచించారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ చంద్రుగొండ కాంప్లెక్స్ సముదాయ వనరుల వ్యక్తి సేవ్యా బానోత్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో స్వాతి శోభ..

## గిరిప్రదక్షిణలో పాల్గొన్న ప్రభుత్వ విప్ : బీర్ల అయిలయ్య

**యాదగిరిగుట్ట టెంపుల్ ఆగస్టు 19 (జనం సాక్షి)** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి స్వాతి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అధికారులు ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆలేరు ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ శ్రీ బీర్ల అయిలయ్య పాల్గొన్నారు.వేకువజామున ఆలయ ముఖ మండపంలో అర్చకులు శతఘటాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య , ఆలయ ఈవో భవాని శంకర్ తో కలిసి గిరిప్రదక్షిణను ప్రారంభించారు. స్వాతి జన్మ నక్షత్రం సందర్భంగా నిర్వహించిన ఈ గిరిప్రదక్షిణలో వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. గోవింద నామస్మరణలు, భక్తుల ఆధ్యాత్మిక సందడితో యాదగిరిగుట్ట పరిసరాలు మార్మోగాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందుతూ గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు.





# హెచ్‌సీఏ వన్డే టోర్నీకి కోదాడ క్రీడాకారుడి ఎంపిక



**కోదాడ( జనం సాక్షి):** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సి-డివిజన్ వన్డే లీగ్ కమ్ నాకౌట్ టోర్నీకి ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టులో కోదాడ క్రికెట్ అకాడమీ క్రీడాకారుడు గొర్రె చాణిక్య ఎంపికయ్యాడు. చిన్న వయసు నుంచే క్రికెట్‌పై ఆసక్తితో శిక్షణ పొందుతున్న చాణిక్య ప్రతిభను గుర్తించి జిల్లా జట్టుకు ఎంపిక చేయడం పట్ల అకాడమీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అకాడమీ కోచ్ షేక్ సిద్ధిఖ్ చాణిక్యను అభినందించి, టోర్నీలో రాణించి కోదాడకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా జట్టుకు ఎంపిక కావడం కోదాడ క్రికెట్ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. చాణిక్య మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోదాడ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

# ఖుదాబక్షిపల్లిలో ఉచిత వైద్య శిబిరం



**మర్రిగూడ, ఆగస్టు 19 (జనం సాక్షి)** నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం ఖుదాబక్షిపల్లి గ్రామంలో ప్రోగ్రెసివ్ సఫాయి కర్మచారీస్ సంఘం తెలంగాణ రాష్ట్ర అడ్వైజర్ మహమ్మద్ వహీద్ ఆధ్వర్యంలో, మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.గ్రామ సర్పంచ్ పందుల జయలక్ష్మిగౌడ్, గ్రామ పెద్దలు మద్ది విఠల్‌రెడ్డి, కామ్రేడ్ సత్యం కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులకు వైద్యులు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.కార్యక్రమం అనంతరం వైద్యులు, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామ పెద్దలను మహమ్మద్ వహీద్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ షేక్ షబ్బీర్, పందుల పాండుగౌడ్, కోట్ల మధుకర్, డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ లాడియా, వంశీరెడ్డి, ప్రియా, శర్వాణి, లలిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎడమ కాలువకు నీటిని తక్షణమే విడుదల చేయాలి

## బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు పిలుట్ల రఘు

**హుజూర్ నగర్, ఆగస్టు 19 (జనంసాక్షి):** సాగర్ ఆయకట్టు ప్రాంతమైన ఎడమ కాలువకు తక్షణమే నీటిని విడుదల చేయాలని హుజూర్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెద్ద కాలువ ను నియోజకవర్గ, వివిధ గ్రామాల పార్టీ నాయకులతో కలిసి క్షేత్ర స్థాయిలో సందర్శన చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు పిల్లుట్ల రఘు మాట్లాడుతూ సాగర్ ప్రాజెక్టు దాదాపు 520 అడుగుల పై చిలుకు నీటి సామర్థ్యం చేరుకున్నప్పటికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎడమ కాలువ ఆయకట్టుకు నీటిని విడుదల చేయకుండా ఈ ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తుందో చెప్పాలని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు పిల్లుట్ల రఘు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, నాగార్జున సాగర్ లో డెడ్ స్టోరేజ్ ఉన్నప్పటికీ సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు కింద సాగుచేసిన పంటలను ఎండకుండా రక్షించుకోవడం కోసం సాగర్ నుండి నీటిని విడుదల చేయించి రైతాంగాన్ని కాపాడారని గుర్తు చేశారు. నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సాగర్ పైనున్న శ్రీశైలం ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తుంటే సాగర్ ఆయకట్టుకు మాత్రం నీటిని విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ యాగాలపేరుతో బోగాలను అనుభవిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. గతంలో శ్రీశైలం జలాశయం నీటిమట్టం 834 అడుగులు చేరుకోగానే పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి చేపట్టాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో నెంబర్ 34 ను విడుదల చేసి అనేక పర్యాయాలు విద్యుత్ ఉత్పత్తిని కూడా చేపట్టారన్నా విషయాన్ని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికీ శ్రీశైలం నుండి అక్రమంగా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రోజుకు 30వేల నుండి 40వేల క్యూసెక్కుల నీటిని తరలించక పోతుంటే తెలంగాణ ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. ?తెలంగాణ లో ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు అవుతుందని 80 శాతం రైతులు సాగు ప్రారంభించారని మరికొందరు సాగర్ నీటి విడుదల వైపు ఆశగా చూస్తున్నారని అన్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నప్పటికీ హుజూర్ నగర్ రైతాంగానికి ప్రత్యేకమైన ప్రయోజనం ఏది జరగక పోగా ఎప్పుడు నష్టమే జరుగుతుందని తక్షణమే వారు



స్పందించి సాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేపట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఉద్యమ నాయకులు న్యాయవాది నగేష్ రాథోడ్, మాజీ జడ్పిటిసి జగన్ నాయక్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కోలాహలం కృష్ణంరాజు, మాజీ జెడ్పిటిసి బాణావత్ బాబు నాయక్, పెరుమళ్ళ సతీష్, కౌన్సిలర్ కోలపూడి చంటి, ముల్కపల్లి రాంబాబు, శ్రీనివాసరాజు, వెంకన్న, గుడిమల్కాపురం సర్పంచ్ పుల శ్రీను, గరిడేపల్లి మండల అధ్యక్షులు గుగులోతు కృష్ణ నాయక్, రామాపురం సర్పంచ్ నాగుల్ మీరా, పృధ్వి, కాకునూరి శివారెడ్డి, బాలు నాయక్, శ్రీకాంత్, వినోద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

**ఆత్మకూర్ (ఎం) జనంసాక్షి ఆగస్టు (19)** ఆత్మకూరు (ఎం) మండల ఫోటో మరియు వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా బుధవారం రోజున మండల ఫోటో అండ్ వీడియోగ్రఫి సంఘం అధ్యక్షుడు యాస సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎలగందుల మహేష్, జిల్లా కార్యదర్శి గజరాజు కాశీనాథ్, 7వ వార్డు మెంబర్ బూడిద శేఖర్ , రంగ పరుశు రాం,వంగరి మహబూషి,కోల నరేష్ , చిత్తర్ల అనిల్,వేముల నవీన్ ,కోల సాయిఅఖిల్ , కటేకోల ప్రవీణ్ , కటేకోల పవన్ , ఉగ్గే ప్రమోద్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# కోమటిపల్లి లో రైతులకు మందులు అంద చేస్తున్న సర్పంచ్



**జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి):** వర్షాభావ పరిస్థితుల మూలంగా మేకలు, గొర్రెలకు వ్యాధులు రాకుండా పెంపకం దారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జాజిరెడ్డిగూడెం మండల పశువైద్యాధికారి అంతటి అనిల్ కుమార్, కోమటిపల్లి గ్రామ సర్పంచ్ నున్న యాదగిరి అన్నారు. బుధవారం కోమటి పల్లి గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించి ఉచితంగా దాణా, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎం . గోవర్ధన్, వీఎల్ఏ పద్మ, ఎల్ ఎఫ్ ఏ లతీఫ్, గోపాశ్రీజీ మిత్రుడు లింగయ్య, సురేందర్, యాకయ్య, అర్జున్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి):** ప్రతి ఒక్కరు గంజాయి, డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా టీం లీడర్ వెన్నెల నాగరాజు కోరారు. బుధవారం బొల్లంపల్లి గ్రామంలో డ్రగ్స్ గంజాయికి వ్యతిరేకంగా, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని తదితర అంశాలపై సారధి కళాకారుల ఆధ్వర్యంలో ఆట-పాట -మాటల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సారధి కళాకారులు శంకర్, సైదులు, లక్ష్మి, మేడిపల్లి వేణు, శిరీష, రాధ, గ్రామస్తులు పాల్గొన్నారు.



# సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ కోసం చేసే పోరాటాలకు ఆర్యవైశ్యుల పూర్తి మద్దతు

## అఖిలపక్ష రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలిపిన ఆర్యవైశ్య సంఘ నాయకులు



**సూర్యాపేట(జనంసాక్షి):** సూర్యాపేట ప్రజల చిరకాల స్వప్నం కోసం పోరాడుతున్న బుల్లెట్ ట్రైన్ సాధన సమితి చేపట్టే ఏ కార్యక్రమానికైనా తమ పూర్తి మద్దతు ఉంటుందని ఆర్యవైశ్య సంఘ నాయకులు ప్రకటించారు బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో ఆరవ రోజు బుధవారం ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేటకు రైల్వే మార్గం వస్తే ఈ ప్రాంతమంతా పారిశ్రామికంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం బుల్లెట్ ట్రైన్ అలాట్మెంట్ ను మొదట సూర్యాపేటకు కేటాయించి తర్వాత మార్గాన్ని మార్చడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర మంత్రులు కలుగజేసుకొని కేంద్ర రైల్వే శాఖ మంత్రితో మాట్లాడి జాతీయ రహదారి 65కు సమాంతరంగా బుల్లెట్ ట్రైన్ ఏర్పాటు చేయడంతో పాటు సూర్యాపేటకు రైల్వే కారిడార్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.బుల్లెట్ ట్రైన్ సాధన సమితి నిర్వహిస్తున్న కార్యక్రమాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు.సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించుకునేందుకు ప్రజలంతా ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు.ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్న నిరాహార దీక్షకు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, ప్రముఖ పారిశ్రామికవేత్త మీలా మహదేవ్, కౌన్సిలర్ డాక్టర్ రామ్మూర్తి, రాష్ట్ర నాయకులు పెద్దిరెడ్డి రాజా,పెద్దిరెడ్డి గణేష్,బిఆర్ఎస్ నాయకులు ఉప్పల ఆనంద్ సంఘీభావం తెలిపారు. సాయంత్రం అఖిలపక్ష నాయకులు దీక్షలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘ నాయకులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.ఈ కార్యక్రమంలో బుల్లెట్ ట్రైన్ సాధన సమితి అఖిలపక్షాల కన్వీనర్ ఆరుట్ల జానకిరెడ్డి, కుంట్ల ధర్మార్జున్,మాజీ జడ్పిటిసి జీడి భిక్షం, నాగయ్య,ఈ రిలే నిరాహార దీక్షలో ఆర్యవైశ్య సంఘ నాయకులు బండారు రాజా, కర్నాటి కిషన్, బొమ్మిడి లక్ష్మినారాయణ, తోట శ్యాంప్రసాద్,కలకోట లక్ష్మయ్య, వెంపటి పురుషోత్తం, పోతుగంటి వెంకటేశ్వర్లు, వెంపటి సురేష్ ,తప్పి గాంధీ,ఈగ దయాకర్, గుండా రమేష్ ,ఈగ వెంకటేశ్వర్లు, వెంపటి శబరినాథ్, బచ్చు పురుషోత్తం, షీలా శంకర్,చల్లా సత్యనారాయణ, కర్నాటి కృష్ణ పాల్గొన్నారు.



## గ్రామ పంచాయతి కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

### రాష్ట్ర ఉపాధ్యక్షులు కూరెళ్ళ కిష్టయ్య

**ఆత్మకూర్ (ఎం) జనం సాక్షి ఆగస్టు (18)**
తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ ఁ వర్కర్స్ యూనియన్ ఆత్మకూర్ (యం) మండలంలో రాష్ట్ర కమిటి పిలుపు మేరకు మొదటి రోజు దీక్ష కార్యక్రమం నిర్వహించచారు. ఈ దీక్ష కార్యక్రమం లో తమ డిమాండ్స్ తో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ రాములు నాయక్ కు ఇవ్వడం జరిగినది. డిమాండ్స్ లో కనీస వేతనం ప్రతి కార్మికునికి 26000 రూ – లు ఇవ్వాలి. రెండవ ఖఖీఅ ప్రతి కార్మికునికి వర్తించాలి. జి వో నెంబర్ 51 ని సవరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కూరెళ్ళ కిష్టయ్య, రాష్ట్ర నాయకులు నోముల స్వామి, మండల అధ్యక్షులు ఇంద్రపెల్లి జ్ఞానేశ్వర్, కార్యదర్శి రాగటి శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ సుదగాని రమేష్, ఉపాధ్యక్షుడు పోలేపాక నర్సింహా, కూరెళ్ళ సైదులు, మందుల మహిపాల్, గంగారపు సాయి, చుంచు చంద్రయ్య, తాళ్ళపెల్లి నర్సయ్య, మోత్కూరు పద్మ, అంబోజు సత్యారాములు, ఎనూతుల కవిత, రాచమల్ల లలిత, కొంగరి పకీర ,తదితరులు పాల్గొనడం జరిగింది.

## కోదాడలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

**కోదాడ టౌన్ ఆగస్టు 19 ( జనంసాక్షి );** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవంను పురస్కరించుకొని బుధవారం కోదాడలో ఘనంగా నిర్వహించారు. ది కోదాడ ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం పట్టణంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు సీనియర్ ఫోటోగ్రాఫర్లు మాట్లాడుతూ ప్రభుత్వం ఫోటోగ్రాఫర్లను కళాకారులుగా గుర్తించాలని కోరారు. రాష్ట్రంలో కొన్ని వేల కుటుంబాలు ఫోటోగ్రఫీ వృత్తి మీదే ఆధారపడి జీవిస్తున్నాయని ఇదే వృత్తిని నమ్ముకున్న ఫోటోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుల వర్మ,ప్రధాన కార్యదర్శి కర్ష స్వామి,సీనియర్ ఫోటోగ్రాఫర్లు జెమిని నరేష్, షరీఫ్,సాయి వంశీ రాంబాబు,చిత్తూరుశేషు,రామకృష్ణ రాగం, ఉపేందర్, మణికంత, కోటేశ్వరరావు,సైదా,రఫీ వీరస్వామి, నాగరాజు, హరీష్, ప్రవీణ్,ఉపేందర్, అహ్మద్ఫోటోగ్రఫీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## దమనకాండకు బెధరని కమ్యూనిస్ట్ యోధుడు

### మేకల రాములు స్తూపావిష్కరణలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**సంస్థాన్ నారాయణపురంఆగస్టు 19 (జనం సాక్షి):** అక్రమ నిర్బంధాలతో పోలీసు దమన కాండను ఎదుర్కొన్న బెదరని కమ్యూనిస్టు పోరాటయోధుడు మేకల రాములు అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థ నారాయణపురం మండలం చిల్లాపూర్ గ్రామానికి చెందిన సిపిఐ నాయకుడు మేకల రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన స్మారక చీనంగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో చిల్లాపురం గ్రామంలో స్థూపాన్ని నిర్మించారు. బుధవారం నిర్వహించిన స్తూపావిష్కరణకు ఎమ్మెల్సీ నెల్లికటి సత్యం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నారాయణపురం మండలం తో పాటు చిల్లాపురం గ్రామంలో సిపిఐ పార్టీ బలోపేతానికి నిర్బంధాలను ధమన కాండను సైతం లెక్కచేయకుండా కడవరకు పోరాడిన యోధుడు మేకల రాములు అని గుర్తు చేశారు. పోలీసులు అక్రమ కేసులు బనాయించి చిత్రహింసలకు గురిచేసిన కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకున్న వ్యక్తి ఆయన అని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి ఎన్నో త్యాగాలు చేసి కడవరకు అదే పార్టీలో కొనసాగిన నిబద్ధత గల వ్యక్తి రాములు అని కొనియాడారు. మేకల రాములు స్ఫూర్తితో నేటితరం యువత సిపిఐ పార్టీ బలోపేతానికి పనిచేయాలని ఆయన సూచించారు. అవిశ్రాంతంగా కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి కృషి చేసిన మేకల రాములు కుటుంబానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య,పల్లె శేఖర్ రెడ్డి, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, జిల్లా సమితి సభ్యులు చిలువేరు అంజయ్య,కలకొండ సంజీవ, మండల కార్యవర్గ సభ్యులు,వివిధ శాఖల కార్యదర్శిలు, పార్టీ సర్పంచ్ లు,వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గల్లికో బెల్ట్ షాప్

**◆గ్రామాలోఏరులై పారుతున్న మద్యం**

**◆పట్టించుకునే నాదుడే లేడు**



**ఆత్మకూరు (ఎం) జనం సాక్షి ఆగస్టు (19)**
ఆత్మకూరు మండలం తో పాటు మండలం లో నీ అన్ని గ్రామాల్లో మద్యం ఏరులైపారుతోంది. ఆత్మకూరు మండలం కు రెండు వైన్స్ షాప్స్ కు టెండర్ ఉండగా అవి సమయానికి ముస్తువున్నారు అని మందు బాబుల కు అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ దందా జోరు పెరుగుతున్నది. ప్రతీ గ్రామానికో మెడికల్ షాప్ ఉంటుందో ఉండదో కానీ, వీధికొక బెల్ట్ షాప్ ఉంటుందంటే అతిశయోక్తి కాదు.అధికారుల అలసత్వంతో మద్యం మాఫియా గల్లీ కో బెల్ట్ షాపు ఏర్పాటు చేస్తూ అందినకాడికి దండుకుంటున్నది. నివాస గృహాలు, చిన్న చిన్న కిరాణా షాపుల్లోనూ కావలసినంత మద్యం దొరుకుతున్నది. వైన్, బార్ షాపుల్లో సమయం ప్రకారం మద్యం లభ్యమవుతుండగా బెల్టు షాపుల్లో 24 గంటలు అందుబాటులో ఉంటున్నది. ఎప్పుడంటే అప్పుడు.. ఏ బ్రాండ్ అంటే ఆ బ్రాండ్ ఇండ్లలోనే లభిస్తున్నది. కిలోమీటర్ల మేర దూరంలోని వైన్ షాపులకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఐదో, పదో ఎక్కువిస్తే ఇంటి పక్కనే మద్యం దొరుకుతున్నది.
మద్యం విక్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో వైన్ షాపుల నిర్వాహకులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. ఒక్కో వైన్ షాపు పరిధిలో కనీసం 30 చొప్పున బెల్టు షాపులు అనుబంధంగా పని చేస్తున్నాయి. తమ టార్గెట్లు చేరుకునేందుకు బెల్టు షాపులను ఏర్పాటు చేయిస్తూ, అక్రమంగా మద్యం అమ్మకాలు సాగించేలా వైన్‌షాపుల నిర్వా హకులే ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**ఇళ్లలోనే బెల్టు షాపులు**

ఒకప్పుడు బెల్ట్ షాపులు గ్రామానికి రెండు, మూడు భయం భయంగా నిర్వహించేవారు. కానీ నేడు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. అయితే బెల్ట్ షాపులంటే మద్యం దుకాణాల్లా కనిపించవు. కిరాణా దుకాణాలు గా జనరల్ స్టోర్స్ గా హోటల్ గా నడిపిస్తున్నారు. ఏకంగా ఇళ్లలోనే చాలావరకు మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నారు. ఏ రాత్రి వెళ్లినా వీరి వద్ద మద్యం లభిస్తుంది. అడపాదడపా దాడులు చేసే ఆబ్కారీ శాఖ, పోలీసులు మళ్లీ ఇటు వైపు అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో ఇష్టారీతిన అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ అధికారులు బెల్టు షాపులపై చర్యలు తీసుకుంటారా?.. లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

**అధికారులు నిద్రమత్తు వీడాలి..**

గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. మద్యానికి బానిసై యువత ఉద్యోగాలకు వెళ్లకపోవడంతో కుటుంబాల్లో ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. మద్యం కోసం ఆయా గ్రామాల బాటపట్టి యువత రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు నిద్రమత్తు వీడి గ్రామాల్లో ఉన్న బెల్టు దుకాణాలను మూసివేయాలి. మద్యానికి బానిస కాకుండా యువతకు ప్రభుత్వం అవగాహన కల్పించాలి.

**మా ఊళ్లో బెల్టుషాపులు తీసేయాలి: ఆత్మకూరు మహిళలు**

మా గ్రామంలో విచ్చల విడిగా బెల్టుషాపులు వెలిశాయి. ఇటు అధికారులు కానీ.. అటు ప్రజాప్రతినిధులు కానీ.. పట్టించుకున్న పాపాన పోవడం లేదు. పచ్చని సంసారాలుపాడవుతున్నాయి. వేకువ జామునే బెల్టుషాపులు తెరిచి ఉంటున్నాయి. గ్రామంలో ప్రతి కిరాణా షాపు బెల్టుషాపుగా మారింది. యువకులు తాడుగుకు బానిస అవుతున్నారు. ఉదయం లేవగానే చాయ్ తాగుతారో లేదో తెలియదు కానీ.. మద్యం మాత్రం తాగకుండా ఉండలేక పోతున్నారని, పనిచేసిన డబ్బులు మొత్తం తాగుడుకు ఖర్చు పెడుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెల్లుషాపులు తొలగించాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు.



## రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

### ఎస్ఐ లక్ష్మీనారాయణ

**ఆత్మకూర్ (ఎం) జనం సాక్షి ఆగస్టు (19)**

మండలం లో ని కప్రాయపల్లి గ్రామం లో బుధవారం రోజున స్థానిక ఎస్ఐ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలు మరియు వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క వాహనదారుడు ప్రయాణించేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సిబ్బంది పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగాప్రపంచ ఫోటోగ్రాఫర్స్ దినోత్సవం

**హాలియా జనంసాక్షి ఆగస్టు 19**

ఉమ్మడి అనుముల మండల ఫోటో ఢ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈరోజు 187వ ప్రపంచ ఫోటోగ్రాఫర్స్ దినోత్సవం సందర్భంగా శివ్ ల్యాబ్ నుంచి సంబరాల నినాదాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు అనంతరం హాలియా సెంటర్‌లో సమావేశమై ఫోటోగ్రాఫీ రంగానికి విశేష సేవలందించిన కెమెరా సృష్టికర్త చార్లెస్ లూయిస్ డాగరే చిత్రపటానికి పూలమాల వే సీ నివాళు లర్పించారు ఉమ్మడి అనుముల మండల అధ్యక్షుడు గుండెబోయిన నాగరాజు గారు ముఖ్యంగా పాల్గొని, ఫోటోగ్రాఫర్ల సామరస్యానికి, కలాత్మక ప్రయత్నాలకు ప్రోత్సాహం కల్పించగలుగుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఫోటోగ్రాఫర్స్ జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి కృష్ణన్న గారు, జిల్లా ఉపాధ్యక్షులు నడ్డి మల్లేష్ గారు, గౌరవ ????????డు చవ్వా వెంకట్ రెడ్డి గారు, ఉమ్మడి అనుముల మండల కోశాధికారి యడవల్లి గురువయ్య గారు, ఉపాధ్యక్షులు గడ్డమీది నాగార్జున గారు మరియు రేఖ శ్రీరామ్ గారు హాజరైతారు. సహకార సభ్యులు మరియు పాల్గొనిన ఫోటోగ్రాఫర్ల పేర్లు: సంజీవ్ రెడ్డి, విజయ్, మురారి సైదులు, ల్యాబ్ చారి, గురజాల మహేష్, ఓంసాయి సందీప్, విక్రమ్, మిన్ను మహేష్, రాకేష్ రెడ్డి, సందీప్, గిరి, శ్రీను, గణేష్, బ్రహ్మం, చిన్ని యాదవ్, మహేష్ చారి, వేంకటేష్ గోపి తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ చైర్మన్ వ్యాఖ్యలపై భగ్గుమన్న బీఆర్ఎస్..

**◆తీవ్రంగా ఖండించిన పార్టీ శ్రేణులు..**

**◆గుమ్మడికాయల దొంగ ఎవరు అంటే భుజాలు తడుముకున్నట్లు స్పందిస్తున్నారని ఎద్దేవా..**



**చండూరు, ఆగస్టు 19 (జనంసాక్షి)**

చండూరు మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు మంగళవారం రోజు బీఆర్ఎస్‌పై చేసిన వ్యాఖ్యలను స్థానిక బీఆర్ఎస్ నాయకత్వం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు బుధవారం చండూరు పట్టణ అధ్యక్షుడు కొత్తపాటి సతీష్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు విలేకరుల సమావేశం నిర్వహించి చైర్మన్ వ్యాఖ్యలకు ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ... మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా మునుగోడు నియోజకవర్గ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులు, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలకు సంబంధించినవేనని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రగతిపై మాట్లాడితే, వాటిని తమపై చేసిన వ్యక్తిగత ఆరోపణలుగా మార్చుకుని మాట్లాడటం ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. గుమ్మడికాయల దొంగ ఎవరు అంటే భుజాలు తడుముకున్నట్లు" స్పందిస్తున్నారని ఎద్దేవా చేశారు. బాధ్యతాయుతమైన మున్సిపల్ చైర్మన్ పదవిలో ఉండి వాస్తవాలను వక్రీకరిస్తూ నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని వారు హితవు పలికారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని, చైర్మన్ తీరును బీఆర్ఎస్ శ్రేణులు ముక్తకంఠంతో నిరసిస్తున్నాయని నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ గ్రామ, పట్టణ కమిటీ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## వినియోగదారుల మన్ననలు పొందాలి


సూర్యాపేట(జనంసాక్షి):

వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను విక్రయించి వారి మన్ననలు పొందాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ లో ఏర్పాటు చేసిన లక్ష్మణ్ ఎలక్ట్రానిక్ సేల్స్ అండ్ సర్వీసెస్ ను ప్రారంభించి మాట్లాడారు. ఎలక్ట్రానిక్ వస్తువులను కొనుగోలు చేసే వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులతో పాటు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వ్యాపారంలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అనంతుల కృపాకర్, శనగాని రాంబాబు, రాచకొండ శ్రీనివాస్, కమ్రుద్దీన్, వెంకన్న, చికూరి అశోక్, జగదీష్,సాయి, నిర్వాహకులు చీకూరి లక్ష్మణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## మోటకొండూరులో రేపు రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణ

**ముఖ్య అతిథిగా హాజరుకానున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**

**మోటకొండూరు, ఆగష్టు 19 (జనం సాక్షి):**



మోటకొండూరు మండల కేంద్రంలో రేపు (గురువారం, 20వ తేదీ) స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య హాజరుకానున్నారు. గురువారం మధ్యాహ్నం సరిగ్గా 12 గంటలకు ఆయన చేతుల మీదుగా ఈ విగ్రహావిష్కరణ ఘనంగా జరగనుందని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరుని రఘునాథ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిష్టాత్మక కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరుకావాలని రఘునాథ రాజు పిలుపునిచ్చారు. ముఖ్యంగా రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలన్నారు. అలాగే గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, చైర్మన్లు, డైరెక్టర్లు, మహిళా సంఘాల నాయకులు, వివిధ అనుబంధ సంఘాల బాధ్యులు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు సకాలంలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## కాటమయ్య రక్షణ కవచాల పంపిణీ

**ఆత్మకూర్ (ఎం), ఆగస్టు 19 (జనం సాక్షి):**

ఆలేరు పట్టణంలోని గౌడ సంఘం కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వం కల్లు గీత కార్మికుల (గౌడన్నల) రక్షణ కోసం అందిస్తున్న 'కాటమయ్య రక్షణ కవచం' (సేఫ్టీ మోకులు) పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గీత కార్మికులకు రక్షణ కవచాలను పంపిణీ చేశారు. గీత కార్మికుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఈ సందర్భంగా తెలిపారు. ప్రమాదాల నివారణకు రక్షణ పరికరాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మకూర్ మండల పీఏసీఎస్ చైర్మన్ యాస లక్ష్మారెడ్డి, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బత్తిని ఉప్పలయ్య గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్ధులు గౌడ్, కాంగ్రెస్ కార్యకర్తలు, మండల గీత కార్మికులు పాల్గొన్నారు.



# పంచాయతీ కార్మికులకు నెలవారీ వేతనం రూ.26,000 అమలు చేయాలి

### సి.ఐ.టి.యూ అధ్యక్షుడు అవుతా సైదయ్య

**హాలియా జనం సాక్షి ఆగస్టు 19**

డిమాండ్లు:పంచాయతీ కార్మికులకు నెలకు రూ.26,000 వేతనం అమలు చేయాలని సిఐటి అధ్యక్షుడు అవుత సైదయ్య అన్నారు బుధవారం కార్మికులతో కలిసి ఏపీఓకు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయడం; రెండవ పిఆర్‌సిలో గుర్తింపు ఇవ్వడం. జియో నంబర్ 51 సవరణ మేరకు మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయించడం. కారోబార్ బిల్లు గ్రహీతలకు కలెక్టర్ ప్రత్యేక స్థాయి కల్పించడం. ముఖ్యమంత్రి హామీ ప్రకారం గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుల బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమ చేయించడం. అనారోగ్యం లేదా మరణం వల్ల ఖాళీ అయిన స్థానం జరిగినపుడు ఆ కార్మికుల కుటుంబ సభ్యులన పని కల్పించడం. ఆన్‌లైన్‌లో నమోదు అయ్యని కార్మికుల పేర్లను కూడా నమోదు చేయడం. మరణించిన కార్మికుని దహన సంస్కారాలకు కనీసం రూ.30,000 ఆర్థిక సాయం అందించడం. పంచాయతీ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్లు (డబుల్ బెడ్‌రూమ్ స్థాయి) లేదా ఇళ్ల స్థలాలు కేటాయించడం. వినతిపత్రం హస్తాంతర సమయంలో సి.ఐ.టి.యూ జిల్లా నాయకులు, స్థానిక సంఘ ప్రముఖులు పాల్గొన్నారు. ముఖ్య అతిధుల జాబితా ఈ విధంగా ఉంది: మూడవత్ రమేష్ (గ్రామ పంచాయతీ జిల్లా సహాయ కార్యదర్శి), అన్యపాక శీను (మున్సిపల్ రాష్ట్ర కార్యదర్శి), గుంజా సుధాకర్ (మండల అధ్యక్షులు), కే నాగరాజు (కోశాధికారి), పి కోటేష్ (సహాయ కార్యదర్శి), టి శ్రీను, ఎం. రాంబాబు, మురళి మెగావత్, సేవా నాయక్ బుడ్డా శంకర్, మెగావత్ రామకోటి, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.






**నల్లగొండ ప్రతినిధి,ఆగస్ట్ 19,(జనం సాక్షి):**
కట్టంగూరు మండలంలో మట్టి దోపిడీ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.కట్టంగూరులో పెద్ద చెరువు, కుంటలను లక్ష్యంగా చేసుకుని జేసీబీలు, ట్రాక్టర్లతో పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి తరలిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ అనుమతులు లేకుండానే పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.మండల కేంద్రం పరిసర ప్రాంతాలు కొంతకాలంగా మట్టి దోపిడీకి అడ్డాగా మారాయని స్థానికులు చెబుతున్నారు. రాజకీయ అండదండలతో కొందరు వ్యక్తులు యథేచ్ఛగా మట్టి తవ్వి విక్రయిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అధికారుల తీరుపై అనుమానాలు:**
మట్టి తవ్వకాలను అడ్డుకోవాల్సిన రెవెన్యూ, పోలీసు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మట్టి మాఫియా మరింత రెచ్చిపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మట్టి దోపిడీ వెనుక రాజకీయ నాయకుల ప్రమేయం ఉందని, సంబంధిత అధికారులకు వాటాలు అందుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారుల నుంచి స్పష్టమైన వివరణ రావాల్సి ఉంది.

**ప్రభుత్వ హెచ్చరికలు ఎక్కడ?:**
అనుమతులు లేకుండా చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా యంత్రాంగం పదేపదే హెచ్చరిస్తోంది. అక్రమ మట్టి తవ్వకాలు, తరలింపుపై కేసులు నమోదు చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కానీ కట్టంగూరు మండలంలో జరుగుతున్న తవ్వకాలపై మాత్రం చర్యలు కనిపించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**కలెక్టర్, ఎస్పీ జోక్యం చేసుకోవాలి:**
పెద్ద జేసీబీలు, ట్రాక్టర్లతో భారీగా మట్టి తరలిస్తున్నా సంబంధిత శాఖలు ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు నిలదీస్తున్నారు. చెరువులు, కుంటలు ధ్వంసమైతే భవిష్యత్తులో సాగునీరు, భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
కట్టంగూరులో జరుగుతున్న మట్టి తవ్వకాలపై జిల్లా కలెక్టర్, ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**మాకు ఇప్పుడే తెలిసింది:పుష్పాలత.కట్టంగూరు ఎమ్మార్వో:**
జనం సాక్షి ప్రతినిధి కట్టంగూరు ఎమ్మార్వో కి వివరణ కోసం అడుగగా నాకు ఇప్పుడే తెలిసింది అని మా సిబ్బంది ని అక్కడికి పంపిస్తున్న అని చెప్పారు మరిన్ని వివరాలు అడుగబోగ కాల్ కట్ చేశారు.

**ఆమె కనుసన్నల్లోనే అన్ని:**
స్థానిక రెవిన్యూ అధికారి చేతివాటం తో పెద్ద ఎత్తున మట్టి.వ్యాపారం నడుస్తుంది అని ఆరోపణలు వస్తున్నాయి.ఎందుకంటే మట్టి దోపిడీ ఆమె కు తెలిసే నడుస్తుంది అనే ఆరోపణలు వస్తున్నాయి.



# పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**మర్రిగూడ, ఆగస్టు19 (జనంసాక్షి)**
మర్రిగూడ ఎంపీడీవో కార్యాలయం ఎదుట తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు రెండో రోజు దీక్ష చేపట్టారు. అనంతరం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అధికారులకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.



ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య హాజరై మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, జీవో నంబర్ 51ను సవరించాలని, మండలంలోని పలు గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు.పంచాయతీ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలు వంటి సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుల ఖాతాల్లో వేతనాలు జమ చేయాలని అన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు కాని కార్మికుల పేర్లను వెంటనే నమోదు చేయాలని డిమాండ్ చేశారు.ఏళ్ల తరబడి పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత, పర్మినెంట్ ఉద్యోగాలు, కనీస వేతనాలు, ప్రమాద బీమా వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి కనీస వేతనాలు అమలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు గడుస్తున్నా హామీలు అమలు కాకపోవడం బాధాకరమన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఏర్పుల యాదయ్య డిమాండ్ చేశారు.కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రామావత్ రాజు నాయక్, సల్వోజు రామలింగాచారి, వృత్తిదారుల సంఘం మండల అధ్యక్షుడు ఊరిపక్క లింగయ్య, పెరుమాండ్ల మంజుల, ఏరుకొండ లచ్చయ్య, ఊరిపక్క నరసింహ, మాడుగుల శీను, లప్పంగి నరసింహ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

మద్దిరాల(జనంసాక్షి):
ఫోటోగ్రఫీ రంగానికి పునాది వేసిన మహనీయులు, ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యూరె ను స్మరించుకుంటూ, 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మద్దిరాల మండల కేంద్రంలో ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.మండలం ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ మండల అధ్యక్షులు రాగిరి మల్లేష్ గౌడ్ సంఘ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.ఫోటోగ్రఫీ అనేది కేవలం ఒక చిత్రం కాదని, మన జీవితంలోని మధుర జ్ఞాపకాలను, ముఖ్యమైన సంఘటనలను భవిష్యత్ తరాలకు అందించే అద్భుతమైన కళ అని అన్నారు.ఫోటోగ్రఫీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడంలో లూయిస్ డాగ్యూరె చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి నారాయణ, కోశాధికారి ఆకుల నరేష్, రామలింగం, వెంకన్న, శేఖర్, అశోక్, సంతోష్, చలం, సంపత్, ప్రభాకర్, లింగయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల భద్రత కోసమే మై ఆటో ఇస్ సేఫ్ కార్యక్రమం



**ప్రతి ఆటోకు క్యూఆర్ కోడ్ తో కూడిన రక్షణ స్టిక్కర్**

**మహిళలకు, విద్యార్థినులకు, వృద్ధులకు మరింత భద్రత**

**ఆటోవాలాలు బాధ్యతగా ఉండి లైసెన్స్ ఉండాలి జిల్లా ఎస్పీ నరసింహ**

**కోదాడ,( జనం సాక్షి):**
ప్రజల రక్షణ మహిళల, విద్యార్థినిల రక్షణ, ప్రయాణ సమయంలో మెరుగైన భద్రత కల్పించడంలో భాగంగా సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మై ఆటో ఇస్ సేఫ్ అనే ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కార్యక్రమం ద్వారా జిల్లాలో ఉన్న ఆటోలకు క్యూఆర్ కోడ్ తో కూడిన రక్షణ సర్టిఫైడ్ కాపీని అందించడం జరుగుతుందని, దీనిని ఆటోలో స్టిక్కర్ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం అని జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. బుధవారం పట్టణంలో సుమారు 800 ఆటోలకుఈ క్యు అర్ కోడ్ అందించడం జరిగినది అన్నారు.కోదాడ పట్టణ లో కాశీ ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటుచేసిన మై ఆటో ఇస్ సేఫ్ కార్యక్రమం లో భాగంగా ఆటో కు క్యూఆర్ కోడ్ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నరసింహ హాజరైఆటో లకు, డ్రైవర్లకు క్యూఆర్ కోడ్ లు అందజేసి మాట్లాడారు. ప్రజలకు మెరుగైన భద్రత కల్పించడమే జిల్లా పోలీస్ శాఖ లక్ష్యమని దీనిలో భాగంగానే అత్యంత రక్షణ వలయమైన మై ఆటో ఇస్ సేఫ్అనే కార్యక్రమం ద్వారా ప్రతి ఆటోకు క్యూఆర్ కోడ్ ను అందించామని దీని ద్వారా ఎవరైనా ఆటోలో ప్రయాణించే ప్రయాణికులు అనుకోని ఇబ్బందులకు గురైనట్లయితే క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసి మీ యొక్క స్థితిగతులను, ఎక్కడ ఉన్నారు అనే సమాచారాన్ని కుటుంబ సభ్యులకు, స్నేహితులకు పోలీసు వారికి తెలియజేసే అవకాశం ఉందని దీని ద్వారా మీరు మరింత భద్రంగా ఉంటారు అని, దీనిలో భద్రతా పరంగా టీ సేఫ్ అనే యాప్ కూడా ఉన్నది అన్నారు. క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసి ఎమర్జెన్సీ బటన్ నొక్కినట్లయితే క్యూఆర్ కోడ్ ప్రొవైడర్ ద్వారా సంబంధిత పోలీసు వారికి సమాచారం చేరి పోలీస్ వారు అలర్ట్ అవుతారు మీకు రక్షణ కల్పిస్తారని అన్నారు. దీని ద్వారా మహిళలకు విద్యార్థినిలకు, బాలికలకు, వృద్ధులకు, పిల్లలకు చాలా ఉపయోగకరమైనదిగా, రక్షణగా ఉంటుందని తెలియజేశారు. ప్రయాణికులను చేరవేసే సమయంలో ఆటో డ్రైవర్లు బాధ్యతగా ఉండాలని వారిని సురక్షితంగా గమ్యానికి చేర్చాలని కోరారు. ఆటోలు నడుపుతున్న వారిలో విద్యావంతులు గ్రాడ్యుయేట్స్ ఉన్నారని సమాజాన్ని చైతన్య పరచడంలో మీ వంతుగా కృషి చేయాలని అన్నారు ప్రతిరోజు ఎంతోమంది ప్రజలను కలుస్తుంటారని అన్నారు. ప్రజల రక్షణలో, సురక్షితంగా గమ్యం చేర్చడంలో బాధ్యతగా ఉండాలని అన్నారు. ప్రమాదాల నిర్మూలన కోసం పోలీసు శాఖ అనుక్షణం కృషి చేస్తుంది అని తెలిపారు, రోడ్డు ప్రమాదాలు నిర్మూలించి ప్రతి ఒక్కరు సురక్షిత గమ్యం చేరడం ఏ లక్ష్యంగా అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం అన్నారు.
హాజరైన విద్యార్థులను, యువతను ఉద్దేశించి మాట్లాడుతూ మీరు ప్రయాణించే సమయంలో ఈ క్యూఆర్ కోడ్ సద్వినియోగం చేసుకోవచ్చని అన్నారు. విద్యార్థులు దేశ భవిష్యత్తు అని భావితరాలని అన్నారు, ఆర్థిక వేత్త అయిన అమర్త్యసేన్ యువతను ఉద్దేశించి భారత దేశ భవిష్యత్తు, అభివృద్ధిలో యువతే ప్రధాన భూమిక పోషిస్తున్నారని తెలియజేశారు అని గుర్తు చేశారు. యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి శక్తిని కోల్పోతున్నారని మాదకద్రవ్యాలకు గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్నా రవాణా చేస్తున్న వినియోగిస్తున్న అలాంటి వారి సమాచారాన్ని పోలీసులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన పట్టణ పోలీసులను, సిఐ శివ శంకర్ ను, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి ను అభినందించారు. భద్రత పరమైన సాంకేతికతను అందించిన యాప్ నిర్వాహకులు రమేష్ రెడ్డి నీ ఎస్పి గారు అభినందించారు.ఈ కార్యక్రమంలో కోదాడ సబ్ డివిజన్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ ఇన్స్పెక్టర్ శివ శంకర్, మై ఆటో ఇస్ సేఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్ రెడ్డి, ఎస్సై అంజి రెడ్డి పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, విద్యార్థులు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# మండలంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆకస్మిక తనిఖీలు

## ◆పూసలపాడు రేషన్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు
## ◆అభంగాపురం డీలర్‌కు అదనపు బాధ్యతలు

**మాడుగులపల్లి, ఆగస్టు 19(జనంసాక్షి):** నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలంలో సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది రిటైర్డ్ ఏఎస్పీ ఆధ్వర్యంలోని అధికారుల బృందం మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లోని రేషన్ షాపులను తనిఖీ చేసింది తనిఖీల్లో భాగంగా పూసలపాడు గ్రామానికి చెందిన రేషన్ డీలర్ స్టాక్ వివరాలను పరిశీలించగా, ఇ-పాస్ (వ-ఖనీూ) మిషన్ రికార్డుల ప్రకారం ఉండాల్సిన నిల్వల కంటే బియ్యం నిల్వలు తక్కువగా ఉన్నట్లు అధికారులు ప్రాథమిక విచారణలో తేల్చారు ?బియ్యం నిల్వల్లో అవకతవకలకు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో పూసలపాడు రేషన్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసి, డీలర్‌షిప్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తూ పౌరసరఫరాల శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు, కార్డుదారులకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయం పూసలపాడు గ్రామ కార్డుదారులకు రేషన్ సరుకులు పొందే క్రమంలో ఎలాంటి ఆటంకం కలగకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నారు గ్రామానికి చెందిన రేషన్ షాపు అదనపు బాధ్యతలను అభంగాపురం గ్రామ డీలర్‌కు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు





**పక్కదారి పట్టిస్తే ఉపేక్షించం - సివిల్ సప్లై సైదులు**

ఈ సందర్భంగా మిర్యాలగూడ సివిల్ సప్లై అధికారి సైదులు మాట్లాడుతూ.. మండల పరిధిలోని రేషన్ డీలర్లందరికీ గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, అక్రమాలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



# ఎట్టకేలకు ప్రారంభమైన మోడల్ స్కూల్ బాలికల వసతి గృహం

**పి.ఏ.పల్లి,ఆగస్టు 19(జనంసాక్షి):** పి.ఏ.పల్లి మండలంలోని దుగ్యాల తెలంగాణ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహం ఎట్టకేలకు ప్రారంభమైంది.సిబ్బంది కొరత తదితర కారణాలతో ఇంతకాలం ప్రారంభానికి నోచుకోని హాస్టల్‌ను మండల విద్యాధికారి దన్నె రాజు ఆధ్వర్యంలో ప్రారంభించారు. వసతి గృహం అందుబాటులోకి రావడంతో విద్యార్థినులు,తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. బాలికలకు సురక్షితమైన వసతి,పరిశుభ్రమైన వాతావరణం,నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ విజయభాస్కర్,పీజీటీ సరిత,పీఈటీ మల్లేశ్, హాస్టల్ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## 187 వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

చిట్యాల, ఆగస్టు 19 ( జనం సాక్షి): చిట్యాల మండల ఫోటో ఒ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 187 వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను చిట్యాల కనుక దుర్గమ్మ గుడి వద్ద చిట్యాల మండల అధ్యక్షులు దేవనబోయిన సైదులు యాదవ్ ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్రమానికి ముఖ్య అతిథిగా నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు ఏళ్ల బయ్యన్న , తెలంగాణ రాష్ట్ర మహిళ సహాయ కార్యదర్శి ఏళ్ల మాధవి హాజరై లూయిస్ డాగూరే చిత్రపటానికి పూల మాలలు వేసి , అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్ తినిపించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా ప్రచార కార్యదర్శి ముప్పా సుఖేందర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి ఆవుల ఆనంద్ , మండల ప్రధాన కార్యదర్శి కురాకుల సుధీర్ , మండల కోశాధికారి చొప్పరి లింగస్వామి , గాలి యాదగిరి, ఏనుగు రవీందర్ రెడ్డి, నూనె యాదగిరి, మెండే నరసింహ, నల్ల నర్సిరెడ్డి, కన్నెబోయిన నరేందర్ యాదవ్, గంజి గోవర్ధన్, చిర్రబోయిన రవీందర్, గుండాల లింగస్వామి, ఎద్దు శేఖర్, జటంగి శేఖర్, పబ్బు సత్తయ్య, అవిశెట్టి మల్లేష్, శ్రీ రామోజు నరేష్, మూడు దుర్ల శ్రీకాంత్, శ్రీధర్, చిర్రబోయిన రమేష్, చాపల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## రూపారెడ్డి హత్య కేసులో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి పరామర్శ



**గుర్రంపోడు: ఆగస్టు 19 (జనంసాక్షి)** కొండమల్లెపల్లిలో నాగార్జున పాఠశాల ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య ఘటనపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.కేసులో అనుమానితులుగా ఉన్న వంశీ, అనిల్‌పై పోలీసులు దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో, కేసును వేగంగా దర్యాప్తు చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని పాశం గోపాల్ రెడ్డి కోరారు. ఈ ఘటనపై పోలీసులు చేపట్టిన దర్యాప్తుకు, తక్షణ చర్యలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నిందితులు ఎవరైనా చట్ట ప్రకారం కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

## సీజనల్ వ్యాధుల నివారణకు పరిశుభ్రతే కీలకం



**తుంగతుర్తి, ఆగస్టు 19,(జనం సాక్షి)** వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెండం వెంకట రమణ సూచించారు. మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాల లో బుధవారం వ్యక్తిగత, పరిసరాల పరిశు భ్రత, సీజనల్ వ్యాధులపై విద్యార్థిని లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ..ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల వృద్ధిని అరికట్టాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. కలుషిత నీరు, ఆహారం వల్ల టైఫాయిడ్, విరేచనాలు, కలరా, కామెర్లు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. నీటిని కాచి వడబోసి తాగడంతో పాటు వేడి ఆహారం తీసుకోవాలని విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి నాగరాజు, వైద్యాధికారి డాక్టర్ లింగమూర్తి, సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చు నాయక్, పి హెచ్ ఎన్ ఓ మాణిక్యమ్మ, ప్రిన్సిపాల్ సంధ్యారాణి, వైస్ ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ అబ్జలున్నిసా బేగం, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## తుంగతుర్తి సర్కిల్ పోలీస్ స్టేషన్లో ఎన్నికల సందడి



**తుంగతుర్తి ఆగస్టు 19 (జనం సాక్షి)** తుంగతుర్తి సర్కిల్ పోలీస్ స్టేషన్లో జిల్లా పోలీసు అధికారుల సంఘం ఎన్నికల సందడి మొదలైంది, పోలీస్ సంఘం సభ్యులుగా ఎన్నికలలో అశోక్, వెంకన్న, ప్రవీణ్ సభ్యులుగా పోటీ చేస్తున్నట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీఐ ఉపేందర్ రావు తెలిపారు, సర్కిల్లో యూనిటీగా తీసుకొని ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు, ఈ మేరకు సర్కిల్ పరిధిలోని తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ పోలీస్ స్టేషన్లకు చెందిన సుమారు 50 మంది కానిస్టేబుళ్లు హెడ్ కానిస్టేబుళ్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## ఘనంగా 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు



**చింతపల్లి.ఆగస్టు 19 (జనంసాక్షి)** నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ఫోటోగ్రఫీ ద్వారా సేవలందిస్తూ ఆర్థికంగా వెనకబడిన ఫోటోగ్రాఫర్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని చింతపల్లి మండల ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ మండల అధ్యక్షులు బొమ్మజూ రాఘవేంద్ర చారి అన్నారు.. బుధవారం రంగారెడ్డి జిల్లా మాల్ టౌన్ లో పొన్నగంటి కృష్ణ గార్డెన్స్ లో ఘనంగా 187 వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలుఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేల మాటల్లో చెప్పలేని భావాన్ని ఒక “చిత్రం “రూపంలో చెప్పొచ్చు. అది ఆ ఫోటోలో ఉన్న గొప్పదనం. ఆ గొప్ప భావం ఎంతోమందిలో మానవత్వాన్ని నిద్రలేపుతుంది. మనం మరణిస్తాం కానీ మనం తీసిన ఫోటో ఎప్పుడూ సజీవంగా దర్శనమిస్తూ ఉంటుందన్నారు. అనంతరం పలు సమస్యలపై చర్చించారు. మండలం ఫోటోగ్రఫీ అభిమానులకు,మిత్రులకు శ్రేయోభిలాషులందరికి, చింత పల్లి,మాల్ టౌన్ ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులందరికీ 187వ ‘ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సందు పట్ల లక్ష్మణ్ సాగర్, కృష్ణ గౌడ్, నర్సింగ్, శ్రీనివాస్, సుధాకర్, శంకర్,గిరి,శేఖర్గౌడ్,జగన్,, నయీమ్, రాజు, మధు, శివ, రమేష్ తదితరులు పాల్గొన్నారు..

## వెంకటంపేట యాదవ సంఘానికి నూతన కార్యవర్గం ఎన్నిక

### నూతన కార్యవర్గ అధ్యక్షులుగా మర్ల యాదగిరి యాదవ్

**చింతపల్లి, ఆగస్టు 19(జనంసాక్షి)** చింతపల్లి మండలం వెంకటంపేట గ్రామంలో యాదవ సంఘం సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అభివృద్ధితో పాటు సభ్యుల ఐక్యతకు కృషి చేయడం, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల అభ్యున్నతికి పాటుపడాలని నూతన కార్యవర్గ సభ్యులు నిర్ణయించారు.నూతన కార్యవర్గ అధ్యక్షులుగా మర్ల యాదగిరి యాదవ్, ఉపాధ్యక్షులుగా దాసరి మల్లయ్య, క్రికెట్ విభాగానికి జక్కుల శ్రీను, ప్రధాన కార్యదర్శిగా ఉడుత శంకర్ యాదవ్, కార్యదర్శిగా దాసరి ముత్తయ్య, సహాయ కార్యదర్శిగా కొత్తగొల్ల మల్లయ్య, కోశాధికారిగా శివర్ల రమేష్ ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా ఈడబోయిన ఇద్దమ్మ, ఉడుత మల్లమ్మ, మండే రాములు, మర్ల బచ్చయ్య, దాసరి మల్లేష్, మర్ల మల్లయ్య, బట్టు వెంకటయ్య, జక్కుల రాములు, ఈడమూని శంకర్, గోసుల అంజయ్య, శివర్ల అంజయ్య ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మర్ల యాదగిరి యాదవ్ మాట్లాడుతూ, వెంకటంపేట యాదవ సంఘం సభ్యులందరినీ కలుపుకొని సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. యాదవుల సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేస్తామని, సభ్యుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.అలాగే యువతను విద్య, ఉపాధి, క్రీడా రంగాల్లో ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. నూతన కార్యవర్గానికి గ్రామస్థులు, యాదవ సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు..

